మంగళవారం
27-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 245
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దక్షిణ కరోలినాలో కాల్పులు

వాషింగ్టన్: అమెరికాలో కాల్పుల కలకలం రేగింది. దక్షిణ కరోలినాలోని లిటిల్ రివర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు రోడ్డుపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రజలు పరుగులు పెట్టారు. ఈ దాడిలో 11మంది గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించినట్లు హారీ కౌంటీ పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర విభాగాలు ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాయి. భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు అక్కడికి చేరుకున్నాయి. నివాస సముదాయాల మధ్య ఎవరు కాల్పులు జరిపారనే విషయాలు తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఘటన జరిగిన ప్రాంతాల్లో బోటింగ్ వ్యాపారాలు మాత్రామే ఉన్నాయని స్థానిక మీడియా తెలిపింది.

ఇక వైఎస్ఆర్ కడప జిల్లానే

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇక వైఎస్ఆర్ కడప జిల్లాగా అధికారికంగా పిలవనున్నారు. ఇప్పటి వరకు ఉన్న వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసింది. గత ప్రభుత్వ హయాంలో కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా మార్చిన విషయం విదితమే. అనంతరం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో జిల్లా పేరు మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం

- మిగతా 2 లో

పూర్తిస్థాయి డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పూర్తిస్థాయి డీజీపీగా హరీశ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మరో రెండేళ్లపాటు ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీజేశారు. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన ప్యానెల్ నుంచి హరీశ్‌కుమార్ గుప్తా పేరును సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. ఇప్పటివరకు ఆయన ఏపీ ఇంచార్జి డీజీపీగా ఉన్నారు.

డీఆర్‌డీఓ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) చైర్మన్ గా వ్యవహరిస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త సమీర్ వీ కామత్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన 2026 మే 31 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. కామత్ కు డీఆర్‌డీఓ చైర్మన్ గా ఇది రెండోసారి పదవీకాల పొడిగింపు కావడం గమనార్హం. ప్రస్తుత నిబంధనల ప్రకారం కామత్ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియాల్సి ఉంది.

కోవిడ్ కలవరం

భారత్‌లో 1009 కేసులు

- మొదటిస్థానంలో కేరళ
- ఢిల్లీలో 104 క్రియాశీల కేసులు

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి కరోనావైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఢిల్లీలో 104 మంది వైరస్‌తో బాధపడుతున్నారు. ఒక వారంలోనే 99 మంది దీని బారినపడటం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో కేసుల సంఖ్య 400 దాటింది. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 1009గా ఉండగా... వారం వ్యవధిలో 750 మందికి కొత్తగా కరోనా సోకినట్లు సోమవారం ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇటీవల ఆసియా దేశాలు... ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కోవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని

ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు. అవే ఉపరకాలను భారత్‌లో గుర్తించినట్లు ఇటీవల ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం గత వారం

- మిగతా 2 లో

రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు

- సంక్షేమ పథకాలు ... రోల్‌మోడల్
- డిమాండ్‌కు మించి విద్యుత్ సరఫరా
- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రెండు దశాబ్దాల పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, మేం తెచ్చిన ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అచ్చంపేటలో సోమవారం ఆయన విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించి, మరి కొన్నింటికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ... కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి అని స్వయానా ఆయన కుమార్తె కవిత ఇప్పుడు చెబుతుంది కానీ ... ఎన్నికల ముందే రాష్ట్ర ప్రజలు ఈ దెయ్యాలను వదిలించుకొని ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్ దేవుడు ఎలా అవుతాడు... ఇలాంటి దెయ్యాలను రాష్ట్ర పొలిమేరల నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 10 సంవత్సరాలు పాలించిన కేసీఆర్ ఉద్యోగులకు రూ.పదివేల కోట్ల బకాయిలు పెడితే... తాము అధికారంలోకి రాగానే అందులో రూ.ఎనిమిది వేల కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగం వస్తుందని కొట్లాడి యువత ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారని, పదేళ్లు పాలించిన కేసీఆర్ ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేకపోయారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, మరో 30 వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నట్టు చెప్పారు. నిరుద్యోగ యువత కోసం రూ.తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ

- మిగతా 2 లో

ఇక ఈ ఆధార్ ...ఈ సంతకం

- ప్రభుత్వ పేరు ప్రతిష్టలు పెంచేలా సబ్ రిజిస్ట్రార్‌ల పనితీరు ఉండాలి
- సమీక్షలో మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: అవినీతికి దూరంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వ పేరుప్రతిష్టలు పెంచేవిధంగా సబ్ రిజిస్ట్రార్‌ల పనితీరు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా జూన్ రెండో తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఈ ఆధార్ -ఈ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకు రావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఆధార్-ఈ సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాల లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పని భారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్

కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్‌ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగుల పోస్టింగ్‌లపై మంత్రి సమీక్షించారు. స్లాట్ బుకింగ్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఈ ఆధార్ - ఈ సంతకం ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ఆర్‌వోలను నియమించారు.

దేశ సంపద కార్పొరేట్ల వద్దే...

- యుద్ధోన్మాదానికి, మతోన్మాదానికి బీజేపీయే కారణం
- 'స్వామినాథన్' సిఫార్సులు అమలుచేయాలి
- మావోయిస్టులతో శాంతి చర్చలు అవశ్యం
- సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలో చాడ

విశాలాంధ్ర - హనుమకొండ: గడిచిన పదేళ్లలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేక పోయారని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. సీపీఐ హనుమకొండ జిల్లా ద్వితీయ మహాసభలు హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షత వహించగా... ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్ రెడ్డి మాట్లాడారు. తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించబడలేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతం అయిందని, అందుకే పేదల బతుకులు మారలేదని అన్నారు. మోదీ అధికారంలోకి రాక ముందు కేవలం 50 లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు 160 లక్షల కోట్లకు పెరిగిందని అన్నారు. పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇళ్లులేని నిరుపేదలు పెరిగి పోయారని చెప్పారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి తెరలేపిందన్నారు. మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. దేశంలో ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నదని ధ్వజమెత్తారు. కార్పొరేట్లకు 16 లక్షల 35 వేల కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని హితవు పలికారు. శతవసంతాల వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సీపీఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటాలను నిర్వహిస్తుందని తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాపోరాటాలు: తక్కళ్లపల్లి

జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ రాజీలేని ప్రజాపోరాటాలు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. విభజన హామీల అమలులో కేంద్రం విఫలం అయిందన్నారు. కాజీపేటలో మోదీ శంకుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీకి నేటివరకు అనుమతి ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

ఎర్రజెండాలతో ఎరుపెక్కిన హసన్‌పర్తి

రెండు రోజుల పాటు జరుగనున్న సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలను పురస్కరించుకుని సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర జెండాలు, బ్యానర్లతో ఎరుపెక్కింది. పురుషులు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి ప్రదర్శనలో పాల్గొనడంతో హసన్ పర్తి ఎరుపుమయ మైంది. సోమశేఖర ఆసుపత్రి నుంచి హైస్కూల్ వరకు ప్రదర్శన కొనసాగింది. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేదునూరి జ్యోతి, నేదునూరి రాజమౌళి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, ఎన్. అశోక్ స్టాలిన్,సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, నకిర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ పర్యవేక్షణలో కళాకారులు పాటలు పాడి ఉత్తేజ పరిచారు.

'చేనేత' సమస్యల

పరిష్కారానికి కృషి

- బీసీలకూ ప్రత్యేక బడ్జెట్
- హామీలన్నీ అమలు చేయాలి: కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్: వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యతగల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. చేనేత వృత్తి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక నిధులు కేటాయించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి అధ్వర్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగింది. సీపీఐ ఎంఎల్‌సీ నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహ్మారెడ్డి, సీపీఐ(ఎం)సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చేరుపల్లి సీతారాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, చిక్క దేవాదాసు, రాపోలు జగన్, దాసు సురేష్, రాపోలు వీర మోహన్, ఏశాల అశోక్, కోట రాజయ్య, జల్లి రాములు, పెండెం సర్వేశం, చేపూరి ధనంజయ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కుల వృత్తుల వారికి నిధులను కేటాయించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత సహకారా సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని దీంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. హామీలను అమలును ప్రభుత్వం దాటవేసే ప్రయత్నం చేస్తోందని, ఇది మంచింది కాదని, భవిష్యత్‌లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

భజన బృందం కాదు, మంత్రుల బృందం!

మృత్యు ఘోష

వేర్వేరు ఘటనల్లో ఏడుగురి దుర్మరణం

2 లో

సజీవంగా పట్టుకొని కాల్చిచంపారు

- విద్రోహుల సమాచారంతోనే ఎన్‌కౌంటర్
- నంబాల ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టుల లేఖ

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావును సజీవంగా పట్టుకొని కాల్చిచంపారని మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో సోమవారం లేఖ విడుదలైంది. ఆ లేఖలో నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన కారణాలు పేర్కొన్నారు. 'లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఎన్‌కౌంటర్ జరిగింది. 6 నెలలుగా కేశవరావు అబూజ్‌మడ్ ప్రాంతంలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలుసు. కేశవరావు బృందంలో ఉన్న ఆరుగురు ఇటీవలే లొంగిపోయారు. వాళ్లు ఇచ్చిన సమాచారంతో ఎన్‌కౌంటర్ జరిగింది. యూనిఫైడ్ కమాండో సభ్యుడు దేశ ద్రోహిగా మారాడు. అతనితోపాటు

- మిగతా 2 లో

నంబాలకు అంత్యక్రియలు

చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన తెలుగురాష్ట్రాలకు చెందిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, నాగేశ్వరరావు సహా కొంతమంది మృతదేహాలను బంధువులకు అప్పగించకుండానే

- మిగతా 2 లో

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామ స్వరాజ్యాన్ని ఊహించుకోలేం
- త్వరలో గ్రామ పాలనాధికారుల నియామకం: మంత్రి సీతక్క

2 లో

భారత్‌కు వెళితే...25% సుంకం

మరోసారి 'యాపిల్'కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెక్నాలజీ దిగ్గజం యాపిల్‌ను మరోసారి బెదిరించారు. ఐఫోన్లు భారత్‌లో కాకుండా అమెరికాలోనే తయారు చేయాలని, లేనిపక్షంలో దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తామని ఆయన హెచ్చరించారు. భారత్ సుంకాలు లేని ఒప్పందాలను ప్రతిపాదించినప్పటికీ, దేశీయంగానే ఉత్పత్తి జరగాలన్నది తన కోరిక అని ట్రంప్ స్పష్టం చేశారు. అణుశక్తిపై కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసే కార్యక్రమం కోసం వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్‌లో ఉన్న సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో జరిగిన చర్చల్ని ప్రస్తావిస్తూ... "టిమ్ ఇలా చేయరని నేను భావించాను. భారత్‌లో ప్లాంట్లు నిర్మించబోతున్నట్లు ఆయన చెప్పారు. 'సరే, భారత్ కు వెళతారా.. వెళ్లండి... కానీ సుంకాలు లేకుండా ఇక్కడ (అమెరికాలో) అమ్మలేరు' అని నేను చెప్పాను" అని ట్రంప్ తెలిపారు. ఐఫోన్ల గురించి తాము మాట్లాడుతున్నామని, వాటిని అమెరికాలో అమ్మాలంటే, అవి అమెరికాలోనే తయారుకావాలని తాను కోరుకుంటున్నట్లు ఆయన నొక్కి చెప్పారు. మొదట యాపిల్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించిన ట్రంప్, ఆ తర్వాత ఈ సుంకం బెదిరింపును శాంసంగ్, హువావే వంటి అన్ని స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలకు వర్తింపజేస్తూ... "ఆ ఉత్పత్తిని తయారుచేసే ఎవరికైనా ఇది వర్తిస్తుంది, లేకపోతే అది న్యాయంగా ఉండదు" అని అన్నారు. ఈ సుంకాలు 2025 జూన్ ఆఖరుకు అమల్లోకి వస్తాయని తెలుస్తోంది. అంతకుముందు ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో కూడా ట్రంప్ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు.

గాజాపై క్షిపణుల వర్షం

54 మంది మృతి...

అనేకమందికి తీవ్ర గాయాలు

టెల్ అవీవ్: హమాస్ పై యుద్ధం పేరుతో ఇజ్రాయిల్ భీకర దాడులకు పాల్పడటం ద్వారా అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటోంది. తాజాగా సెంట్రల్ గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దళం డ్రోన్‌లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడి ఆదివారం రాత్రి గాజాలోని ఒక రద్దీ ప్రాంతంలో జరిగింది. అక్కడ పాఠశాలలు ఆశ్రయ కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడ వివిధ కుటుంబాలు ఆశ్రయం పొందుతున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం ఈ పాఠశాలలో హమాస్ కమాండ్ సెంటర్ ఉందని చెబుతోంది. అయితే ఈ వాదనపై స్థానికులు, అంతర్జాతీయ సంస్థలు సందేహం వ్యక్తం చేశాయి. ఈ దాడిలో మరణించిన వారిలో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారని నివేదికలు సూచిస్తున్నాయి. స్థానిక ఆసుపత్రుల నివేదికల ప్రకారం ఈ దాడిలో 54 మంది మరణించగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికులలో భయాందోళనలను రేకెత్తించింది. ఎందుకంటే పాఠశాలలు సాధారణంగా సురక్షిత ప్రాంతాలుగా పరిగణించబడతాయి. ఈ దాడి ద్వారా ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే సామాన్య పౌరులు, ముఖ్యంగా పిల్లలు ఈ హింసలో బాధితులయ్యారు. కాగా ఐక్య రాజ్యసమితి (ఐరాస) సహా ఇతర మానవ హక్కుల సంస్థలు ఈ దాడిని ఖండించాయి. దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశాయి. కాగా సోషల్ మీడియా వేదికగా దాడి చిత్రాలు వైరల్ అయ్యాయి. గత శుక్రవారం కూడా ఇజ్రాయిల్ సైన్యం ఖాన్ యూనిస్‌పై వైమానిక దాడి జరిపింది. గాజాకు చెందిన హమ్ది అల్-నజ్జర్ అనే డాక్టర్ తన 10 మంది పిల్లలతోపాటు ఇంట్లో ఉన్నప్పుడు ఈ దాడి జరగడంతో ఆ పిల్లల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. డాక్టర్ నజ్జర్‌తోపాటు ఒక చిన్నారి ప్రాణాలతో బయటపడ్డారు. అయితే నజ్జర్ తీవ్రంగా గాయపడటంతో ప్రస్తుతం దక్షిణ గాజా సమీపంలోని నాజర్ దవాఖాన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

బంగ్లా యువతులతో తస్మాత్ జాగ్రత్త!

చైనా రాయబార కార్యాలయం హెచ్చరిక

ఢాకా: మోసపూరిత క్రాస్ బోర్డర్ డేటింగ్ వీడియోలు, సమాచారం, అనధికారిక మ్యాట్రిమోనీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని బంగ్లాదేశ్‌లోని చైనా రాయబార కార్యాలయం తమ పౌరులను హెచ్చరించింది. బంగ్లా యువతులతో అక్రమ వివాహాలు వద్దని, అక్కడ వివాహాలు చేసుకొనే ముందు అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించింది. చైనాలో కొన్నేళ్లుగా వివాహాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పెళ్లి చేసుకోవడానికి ఆ దేశంలో యువతుల కొరత ఏర్పడటంతో దానిని అధిగమించడానికి అక్రమమార్గంలో వివాహాలు చేసుకుంటున్నట్లు గుర్తించిన నేపథ్యంలో కీలక చర్యలు చేపట్టినట్లు ఆ దేశ మీడియా కథనాలు వెల్లడించాయి. వివాహాల కోసం బంగ్లా యువతులను చైనాకు అక్రమరవాణా చేస్తున్నారని ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. చట్ట విరుద్ధంగా ఈ పెళ్లిళ్ల తంతు నడుస్తోందని, ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులకు దారితీయొచ్చని బంగ్లాదేశ్‌లోని చైనా రాయబార కార్యాలయం తన అడ్వైజరీలో పేర్కొంది. సరిహద్దు ఆవల లైంగిక సంబంధాలు, వివాహాల బాధితులు వెంటనే పబ్లిక్ సెక్యూరిటీ అథారిటీకి ఫిర్యాదు చేయాలని సూచించింది. ఈ తరహా పెళ్లిళ్లు చేసుకుంటే.. మానవ అక్రమరవాణా కింద చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. బంగ్లా చట్టాల ప్రకారం.. మానవ అక్రమరవాణాకు పాల్పడి, దోషిగా తేలితే ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. కేసు తీవ్రతను బట్టి యావజ్జీవ, మరణశిక్షలు కూడా ఉండొచ్చు.

రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు

(మొదటిపేజీ తరువాయి)

వికాసం పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నామని, సన్నధాన్యం రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని... ఇవి చూసి కేసీఆర్ ఓర్వలేకపోతున్నారన్నారు. ఒకేసారి రూ.22 వేల కోట్ల రైతు రుణమాఫీ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. భూమిలేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ప్రతి ఏడాది రూ.12 వేలు ఇస్తున్నామని, రూ. రెండువేలు అదనంగా పెంచి రైతు భరోసా ఇస్తున్నందుకు చూడలేక ఫామ్ హౌస్ లో పడుకున్న కేసీఆర్ కన్నీరు పెడుతున్నారని ధ్వజమెత్తారు. అచ్చంపేటలో రూ.12,600 కోట్లతో నల్లమల డిక్లరేషన్ చేశామని గుర్తు చేశారు. గిరిజనుల గురించి కేసీఆర్ ఒక్కసారైనా ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పేరిట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలి ఇచ్చిన 6.70 లక్షల ఎకరాలకు సోలార్ కరెంటు, పంపు సెట్లు, డ్రిప్ స్ప్రింక్లర్లను, ఉద్యాన శాఖ ద్వారా అవకాడో, వెదురు, నిమ్మ వంటి మొక్కలను ఉచితంగా గిరిజన రైతులకు అందిస్తున్నామని వివరించారు. గత పాలకులు పదేళ్లలో ఒక్కసారి కూడా డైట్ చార్జీలు పెంచలేదని, తాము 40 శాతం డైట్, రెండు వందల శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాలు విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నాం అన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలు అంతా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. వేసవిలో రికార్డు స్థాయిలో 17,162 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ వచ్చినప్పటికీ నిమిషం అంతరాయం లేకుండా సరఫరా చేశామని చెప్పారు. 2029 - 30 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తాం అన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణకు నాలుగు శాతం అదనంగా విద్యుత్ ఇవ్వాలని నాడు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నిబంధన పెట్టడంతో రాష్ట్రానికి కరెంటు వచ్చింది తప్ప కేసీఆర్ వల్లనో ఆయన మంత్రివర్గం వలన కరెంటు రాలేదని స్పష్టం చేశారు. ఆర్థిక భారం అయినా రాష్ట్రంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటల ఉచిత కరెంటు అందజేస్తున్నాం, రైతుల పక్షాన ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు రూ.12,500 కోట్లు చెల్లిస్తుందన్నారు. సంపద సృష్టిస్తాం...పేదలకు పంచుతాం, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే గొప్ప రాష్ట్రంగా అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ఆలోచన అని డిప్యూటీ సీఎం వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈ ప్రాజెక్టు జీవో ఇచ్చిందే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.

'చేనేత' సమస్యల పరిష్కారానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

అధికారానికి దూరం చేస్తాయని హెచ్చరించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తనవం తుగా కృషి చేస్తానని కూనంనేని హామీ ఇచ్చారు. నెల్లికంటి మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై శాసనమండలి వేదికగా తన గళాన్ని వినిపిస్తానని అన్నారు. సీతారాములు మాట్లా డుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘటితం కావాలన్నారు. మురళి మాట్లాడుతూ అధికారమే వజ్రాయుధమని దానిని అందిపుచ్చుకోవాలంటే పద్మశాలిలు చట్టసభల్లో అడుగు పెట్టాలన్నారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ గతంలో చేనేత రంగానికి నాబార్డు ద్వారా రూ.వెయ్యి కోట్లు రుణాలుగా ఇచ్చేదని, వీటిని పూర్తిగా నిలిపివేయడంతో చేనేత కార్మికులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు రుణాలు తీసుకునే వాటిని తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు.

కోవిడ్ కలవరం

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం రాష్ట్రాల వారీగా కోవిడ్ కేసులు పరిశీలిస్తే... కేరళలో అత్యధికంగా 430 క్రియాశీల కేసులు ఉండగా... మహారాష్ట్ర (209), ఢిల్లీ (104), గుజరాత్ (83), తమిళనాడు (69), కర్నాటక (47), ఉత్తరప్రదేశ్ (15), రాజస్థాన్ (13), పశ్చిమబెంగాల్ 12, పుదుచ్చేరి 9, హర్యానా 9, ఆంధ్రప్రదేశ్ 4, మధ్యప్రదేశ్ 2, తెలంగాణ, గోవా, ఛత్తీస్‌గఢ్‌లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. తాజాగా బీహార్‌లో ఒక కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కేసులు నమోదవుతున్నప్పటికీ... తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది.

ఇక... వైఎస్ఆర్ కడప జిల్లానే

(మొదటిపేజీ తరువాయి)

కడప జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కడప పేరును తొలగించి వైఎస్ఆర్ జిల్లాగా పరిగణించడంపై గతంలో ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తాయి. గతంలో జిల్లాలో ప్రతిపక్ష నేత హోదాలో పర్యటించిన సీఎం చంద్రబాబు పేరు మార్పుపై హామీ ఇచ్చారు. మంత్రి సత్యకుమార్ సైతం పేరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ... గతంలో సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో వైఎస్సార్ కడప జిల్లాగా నామకరణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయానికి వచ్చి పేరు మార్పుపై నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు ఇచ్చింది.

మృత్యు ఘోష

- మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు
- గోదావరిలో ఎనిమిది మంది యువకుల గల్లంతు
- మూడు జిల్లాల్లో విషాద ఛాయలు

విశాలాంధ్ర-రాజానగరం/శ్రీకాకుళం/ముమ్మిడివరం: రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో సోమవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృత్యువాత పడగా... ఎనిమిది మంది యువకులు గోదావరిలో గల్లంతయ్యారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విషాదం అలుముకుంది. తూర్పు గోదావరి జిల్లా కొంతమూరు జాతీయ రహదారిపై లారీ కారు ఢీకొన్న ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం తలతంపర పంచాయతీ పరిధిలోని సామంత పుట్టుగా గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. విద్యుత్ తీగ తెగిపడటంతో కరెంట్ షాక్‌కి గురై ముగ్గురు మృతి చెందారు. మరో దుర్ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని దగ్గర చోటుచేసుకుంది. సరదాగా స్నానం చేసేందుకు వెళ్లిన 8 మంది యువకులు గోదావరిలో గల్లంతయ్యారు. దీంతో వారి కోసం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. వీరంతా ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వచ్చినట్టు సమాచారం.

కారును ఢీకొట్టిన లారీ

రెండు కుటుంబాల వారు కాకినాడలో బీటెక్ చదువు తున్న మనుమరాలు పుట్టిన రోజు వేడుకల కోసం కారులో వెళుతుండగా... రాజానగరం మండలం దివాన్ చెరువు శివారులోని గామన్ బ్రిడ్జి పై ఏ1గ్యారేజ్ సమీపంలోని జాతీయ రహదారిపై ఏలూరు వైపు వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలివైపు వస్తున్న కారును లారీ ఢీ కొన్నడంతో కారు ముందరి భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కొవ్వూరుకు చెందిన ఉప్పులూరి ప్రసాద్ (60), అతని భార్య ఉప్పులూరి శివ లీలావతి(56), చాగల్లు మండలం మర్కొండపాడు కు చెందిన ఇమ్మన్ని వీర వెంకట సత్యవతి(75) అక్కడి క్కడే మృతి చెందగా... తీవ్రంగా గాయపడిన కొవ్వూరు సమీపంలోని దారవరంకు చెందిన లక్కంసాని బిందు(34) రాజమహేంద్రవరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భర్త లక్కంసాని సురేష్ (36) చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్సైలు పి.మనోహర్, కె.వెంకట నాగార్జున, సిబ్బంది హుటాహు టిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని ఉత్తర మండలం డిఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు.

గ్రామదేవత ఉత్సవంలో అపశృతి

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం తలతంపర పంచాయతీ పరిధిలోని సామంత పుట్టుగా గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాల్లో ఉత్సవాల్లో విద్యుత్ తీగ తెగిపడింది. ఇది గమనించకుండా చిన్నారులు బడియా నందిని (12), నొలియా కృష్ణ(4), పుడియా మనోజ్(3) తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వీరిని కాపాడేందుకు చిల్లా ఈశ్వరరావు(32), చిల్లా తరిణి ప్రయత్నించగా వీరూ కరెంట్ షాక్‌కి గురయ్యారు. ఈ ఘటనలో బడియా నందిని(12), చిల్లా ఈశ్వరరావు(32), నొలియా కృష్ణ (4) అక్కడిక్కడే మృతి చెందారు. గాయపడిన చిల్లా తరణి, పుడియా మనోజ్‌లను చికిత్స నిమిత్తం సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. ఈ ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. గ్రామ దేవత ఉత్సవాల్లో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు.

గోదావరిలో యువకుల గల్లంతు

కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. శుభాకార్యానికి వచ్చిన యువకులు గోదావరిలో గల్లంతయ్యారు. స్నానం చేయడానికి వెళ్లిన ఎనిమిది మంది యువకులు... ప్రమాదవశాత్తు నీటమునిగి కనిపించకుండా పోయారు. ఈ ఘటన ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.గంగవరం మండలం శేరులంక గ్రామంలో ఓ శుభకార్యానికి కాకినాడ, రామచంద్రపురం, మండపేట గ్రామాల నుంచి వివిధ కుటుంబాలవారు వచ్చారు. సమీపంలోని గోదావరిలో స్నానానికి 11మంది యువకులు వెళ్లారు. వీరిలో ఎనిమిది మంది గల్లంతయ్యారు. కాకినాడకు చెందిన నలుగురు క్రాంతి(20), పాల్ (18), సాయి (18), సతీష్ (19) ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామానికి చెందిన మహేష్, రాజేష్ (13), మండపేటకు చెందిన రోహిత్, శేరులంకకు చెందిన మహేష్‌లు గోదావరిలో గల్లంతయ్యారు. ఈ విషయం తెలియడంతో యువకుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు గోదావరిలో దిగి యువకుల కోసం వెతుకుతున్నారు. వారి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సీఎం దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో శుభకార్యానికి వచ్చిన 8 మంది యువకులు గోదావరిలో గల్లంతు కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎలా జరిగింది ? ప్రస్తుతం జరుగుతున్న గాలింపు చర్యలపై అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని, గల్లంతైన వారిని రక్షించేందుకు అవసరమైన అన్నిరకాల చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. గల్లంతైన వారి కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సీఎం సూచించారు.

మహానాడుకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-కడప: కడప వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు సంబరం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. కడప నగరంలో తొలిసారి నిర్వహించే మహానాడు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏర్పాట్లు చేసినట్లు టీడీపీ వర్గాలు వెల్లడించాయి. కడప శివారు పబ్బాపురం (కమలాపురం నియోజకవర్గం) వద్ద 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు కార్యక్రమం జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహానాడుకు వెళ్లే ప్రారంభ ద్వారం, విమానాశ్రయం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా సభా ప్రాంగణానికి వచ్చే మార్గం, కడప నగర వీధుల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కడప నగరం ఎటు చూసినా రోడ్డుకి ఇరువైపులా టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలతో నిండిపోయింది. పండగ వాతావరణం సంతరించుకుంది. మహానాడు ప్రాంగణం నుంచి 10 కిలోమీటర్ల పొడవున పులివెందుల, తాడిపత్రి, కర్నూలు, బద్వేలు, రాజంపేట, రాయచోటి మార్గాల్లో భారీ ఎత్తున స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. కూడళ్లను పసుపు జెండాలతో అలంకరించారు. దాదాపు 5 వేల మంది పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. మహానాడు భద్రతను 15 మంది ఐపీఎస్ అధికారులు, 30 మంది అడిషనల్ ఎస్పీలు, 60 మంది డీఎస్పీలు, 200 మంది సీఐలు, ఎస్ఐలు ఈ విధుల్లో ఉన్నారు. మహానాడు బ్యానర్లు, కటౌట్లు ఫ్లెక్సీలు, హోర్డింగులు, జెండాలతో దారులన్నీ పసుపు మయమయ్యాయి. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల నుంచి దాదాపు 3 లక్షల మందిని సమీకరించడమే లక్ష్యంగా నేతలు పనిచేస్తున్నారు. రాయలసీమ వాసుల ఆకాంక్షలు నెరవేర్చేలా కడపలో మహానాడు నిర్వహిస్తున్నట్లు మంత్రి, పార్టీ సీనియర్ నేత కింజారపు అచ్చెంనాయుడు తెలిపారు. మహానాడు ఏర్పాట్లపై సహచర మంత్రులు, కీలక నేతలతో జరిగిన సమావేశంలో రాయలసీమ డిక్లరేషన్ పై ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. ఈనెల 29న జరిగే బహిరంగ సభకు 5 లక్షల మందికి పైగా తరలి వస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన మహానాడుకు భిన్నంగా కడప మహానాడు ఉంటుందని పేర్కొన్నారు. వేడుక ప్రాంగణంలో వివిధ కమిటీల సభ్యులైన మంత్రులు అచ్చెంనాయుడు, గొట్టిపాటి రవి, నారాయణ, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పార్థసారథి, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్సీలు అలపాటి రాజా, రాంగోపాల్ రెడ్డి తదితరులు సమీక్షించారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి మహానాడు విశేషాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం 8:30 గంటలకు ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభం అవుతుంది. అనంతరం పార్టీ చరిత్రను వివరిస్తూ రూపొందించిన ఫోటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులతో మహానాడు లాంఛనంగా ప్రారంభమవుతుంది. ఇటీవల కాలంలో మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం ప్రకటిస్తారు. ఉదయం 11.30 నిమిషాలకు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్వాగత ప్రసంగం, పార్టీకి సంబంధించి జమ, ఖర్చులపై కోశాధికారి నివేదిస్తారు. 11.50కి టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోపన్యాసం చేస్తారు. తొలిరోజు పార్టీ ప్రతినిధుల సభ జరుగుతుంది. సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ మౌలిక సిద్ధాంతాలపై నేతలు దిశా నిర్దేశం చేస్తారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రూపొందించిన ఆరు సూత్రాల ఆవిష్కరణ, నియమావళిలో సవరణలపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. రెండో రోజు ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నివాళి, ఆరు సూత్రాల్లోని వివిధ అంశాలు, ఏడాదిపాలలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మానాలపై విస్తృతంగా చర్చించి ఆమోదిస్తారని వారు వివరించారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - హైదరాబాద్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాల వల్ల నేడు వారు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని మండిపడ్డారు. సచివాలయంలో సోమవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సెక్రటరీ లోకేశ్ కుమార్, డైరెక్టర్ సృజనతో కలిసి మంత్రి సీతక్క... కార్యదర్శుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ప్రస్తావించిన అంశాలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని లోకేశ్ కుమార్, సృజనను ఆదేశించారు. చేరిన మొదటి రోజు నుంచి సర్వీసును పరిగణలోకి తీసుకోవాలంటే ఎన్నో న్యాయపరమైన చిక్కులు అడ్డొస్తున్నాయని, అయినప్పటికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామ స్వరాజ్యాన్ని ఊహించుకోలేమన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి పంచాయతీ కార్యదర్శుల సమర్థత మీదే ఆధారపడి ఉంటుందని చెప్పారు. 1038 మంది ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా చేయాలన్న ప్రతిపాదనను, స్పోర్ట్స్ కోటాలో రిక్రూట్ అయి తొలగించబడిన 98 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తిరిగి చేర్చుకునే అంశంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కోర్టు తీర్పు కనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వివరించారు. త్వరలో రెవెన్యూ శాఖలో గ్రామ పాలన అధికారులను నియమిస్తున్నామని, అది పూర్తయితే కార్యదర్శులపై పని భారం తగ్గుతుంద న్నారు. అత్యవసర పనుల కోసం కార్యదర్శులు సొంత నిధులు వెచ్చించారని, వారి బిల్లులను త్వరలో విడుదల చేస్తామ న్నారు. టీఏ, డీఏ అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గౌరవాధ్యక్షుడు సందీప్, కోశాధికారి శేఖర్ గౌడ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

రుతు పవనాలు వచ్చేశాయ్

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈసారి సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు న్నాయి. వర్షాల రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర కోస్తా యానాంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల పడనున్నాయి. ఉరుములతో కూడిన మెరుపులు...బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీయనున్నాయి. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవనున్నాయి. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల పడనున్నాయి. రాయలసీమ సమీంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడనున్నాయి.

సజీవంగా పట్టుకొని కాల్చిచంపారు

(మొదటిపేజీ తరువాయి)

కొంతమంది ద్రోహం చేశారు. ఎన్‌కౌంటర్ ముందు రోజు నుంచి 20 వేల మంది బలగాలు మా ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. 10 గంటల్లో ఐదు ఎన్‌కౌంటర్లు జరిపాయి. 60 గంటల పాటు బలగాలు మమ్మల్ని నిర్బంధించాయి. కేశవరావును కాపాడుకునేందుకు 35 మంది ప్రాణాలు అడ్డుపెట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సురక్షింతంగా బయటపడ్డారు. నంబాలను సజీవంగా పట్టుకుని ఎన్‌కౌంటర్ చేశారు. మమ్మల్ని వదిలి కేశవరావును సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని వదిలి కేశవరావు బయటకు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. కేశవరావు ముందుండి మాతోటే నడిచారు. ప్రాణాల్ని పణంగా పెట్టారు. మా నాయకుడిని కాపాడుకోవడంలో మేం విఫలమయ్యాం. ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, మరో మృతదేహాన్ని మేం తీసుకెళ్లాం. దాయాది పాకిస్తాన్ కోరితే కాల్పుల విరమణకు అంగీకరించిన కేంద్రం... మేము చర్చలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆ లేఖలో అసహనం వ్యక్తం చేశారు.

కగార్ పేరుతో జరుగుతున్న ఊచకోత వెనుక ప్రభుత్వ నిజమైన ఉద్దేశాన్ని మన దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని మేము అభ్యర్థిస్తున్నాం. దేశాన్ని, దాని వనరులను కాపాడటానికి అందరూ ఐక్యంగా ముందుకు రావాలి. దేశాన్ని, వనరులను అమ్మేవారికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడండి. ఉగ్రవాదులతో కలిసి జీవిస్తున్న పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు భారత ప్రభుత్వం ఎందుకు ముందుకు వచ్చిందో ప్రశ్నించండి. మన దేశ ప్రజాస్వామ్య, విప్లవాత్మక ప్రజలు శాంతియుత చర్చల ద్వారా సమస్యను పరిష్కరించడానికి కాల్పుల విరమణ కోసం విజ్ఞప్తి చేస్తు న్నారు. కానీ ప్రభుత్వం వినడం లేదు. వందలాది మంది గిరిజన ప్రజలు, నిరసనకారులను హత్య చేయడానికి ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది? పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ విషయంలో ప్రధాని మోదీ నోరు మూయించింది ఎవరు? దేశంలో దేని విజయం కోసం తిరంగ యాత్ర నిర్వహిస్తారు? ఇది ప్రజలను తప్పుదారి పట్టించడం కాదా? దీని అర్థం మనం పాకిస్థాన్‌తో యుద్ధం కోరుకుంటు న్నామని కాదు. దేశ ప్రజలు, పెద్ద కార్పొరేట్లు, సామ్రాజ్యవాదుల మధ్య సంఘర్షణను అర్థం చేసుకోండి. అవసర మైనప్పుడల్లా వారు ఈ ప్రజలకు అలాంటి వాతావరణాన్ని సృష్టిస్తూనే ఉంటారని లేఖలో పేర్కొన్నారు. అమరుడు నంబాల కేశవరావుకు విప్లవ జోహార్లు అర్పించారు.

నంబాలకు అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు అత్యంత భారీ భద్రత మధ్య సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. తమ వారి మృతదేహాల కోసం బంధువులు ఎంత ప్రయత్నించినా పోలీసులు వినిపించుకోలేదు. మృతదేహాలు తమ రాష్ట్రాలకు రావడానికి తెలుగురాష్ట్రాల పాలకులు అంగీకరించకపోవడం వల్లే ఇవ్వడం లేదని పోలీసులు తెలిపారు. మృతదేహాలు అప్పగించాలని కోర్టు ఆదేశించినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. ఎలాంటి సమస్యనైనా తాము కోర్టులో తేల్చుకుంటామని బంధువులకు తెగేసి చెప్పారు.

సర్వేయర్ల పాత్ర ముఖ్యమైనది : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమ వారం నల్లగొండ ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన లైసెన్స్ సర్వేయర్ల ధ్రువపత్రాల పరిశీలన, సామగ్రి పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈనెల 26 నుండి సుమారు 50 పనిదినాలు లైసెన్స్ సర్వేయర్ల కు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వివిధ సందర్భాలలో నిర్వహించే సర్వే సమయంలో సర్వేయర్ల పాత్ర మరువలేని దని అన్నారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అలాగే అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లది కీలక పాత్ర అని అన్నారు. అందువలన సర్వేయర్లు శిక్షణకు హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణ్ణంగా విని అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 150 మంది లైసెన్స్ సర్వేయర్ల కు సర్వే సామాగ్రిని పంపిణీ చేశారు. కాగా జిల్లాలో లైసెన్స్ సర్వేయర్లకై మీ-సేవ ద్వారా 819 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి విడతన సోమవారం 409 మంది ధ్రువపత్రాలు పరిశీలించడం జరిగింది. 2వ విడత ఆగస్టులో మరో 410 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. లైసెన్స్ సర్వేయర్లకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ లో శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమానికి సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇంచార్జ్ ఏ డి సుజాత, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, తదితరులు హాజరయ్యారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-జిల్లా బ్యూరో మహబూబాబాద్ : జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల నుండి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో దరఖాస్తులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల వారితో సమన్వయ పరుస్తూ దరఖాస్తుదారులకు దిశ నిర్దేశం చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రవాణా తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై సమీక్ష నిర్వహించారు. డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, డిఏఓ విజయనిర్మల, హార్టికల్చర్ అధికారి మరియన్న, గ్రౌండ్ వాటర్ డిడి సురేష్, డివిహెచ్‌ఓ డాక్టర్ కిరణ్ కుమార్, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, మత్స్య శాఖాధికారి వీరన్న, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, డిపిఓ హరిప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

మండల కార్యదర్శిగా మారగాని రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శిగా మరిపెడ మండలం నీలికుర్తి గ్రామానికి చెందిన మారగాని బాలకృష్ణను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఐదవ మండల మహాసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డిలు హాజరయ్యారు. ఉన్నత విద్యావంతుడు మొదటి నుండి వామపక్ష విద్యార్థి సంఘ నాయకుడిగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన బాలకృష్ణనూ గుర్తించి సిపిఐ పార్టీ మరిపెడ మండలం కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేసినందున తిరిగి రెండవసారి సిపిఐ మరిపెడ మండలం కార్యదర్శిగా మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై కార్మిక శ్రామిక బడుగు బలహీన వర్గాల అణగారిన వర్గాల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మరిపెడ మండలంలో పార్టీ సూచించిన విధంగా నిరంతరం పోరాటాలు కొనసాగిస్తానని తెలియజేశాడు. ఈ ఎన్నికకు సహకరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధికి జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డితో పాటు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూ హరీష్ అకాడమీ విద్యార్థులను అభినందించిన ఎస్‌పి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్/ తొర్రూర్: జిల్లాలోని తొర్రూర్ పట్టణ కేంద్రంలోని న్యూ హరీష్ అకాడమీ ఆధ్వర్యంలో సమతా డిగ్రీ కళాశాల ఆవరణలో నవోదయ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్న విద్యార్థిని, విద్యార్థులలో ఎంట్రెన్స్ పరీక్షలో పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన గొడిశాల జోనని, చర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు స్ఫూర్తిని, ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన కందగట్ల విశ్వాంక్ భద్రని సీటు, సాధించిన పిల్లలని, మహబూబాద్ జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రాంనాద్ కేకన్ షీల్డ్, శాలువాతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చిన్న వయసులోనే కంపెటీటివ్ ఎక్సమ్‌ని ఎదుర్కొని సీట్ పొందడం ఎంతో అభినందనీయమని, అలాగే ఇంత మంచి ప్రతిభ వంతులైన పిల్లలని వెలికి తీసిన న్యూ హరీష్ అకాడమీ నిర్వాహకులు తండా హరీష్‌ని అభినందిస్తూ మరెంతో మంది విద్యార్థులని మట్టిలో మాణిక్యాలని వెలికితీయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం గాజులగుట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గూడూరు మరి ఆగ్రో సేవా కేంద్రములు సబ్సిడీపై జీలుగు విత్తనాలు లభిస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కేజీల బస్తాకు 2137 రూపాయలని, ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. కావలసిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాసుబుక్ జిరాక్స్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

మేధస్సుకు చిహ్నంగా మంథని నిలవాలి

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : ప్రపంచ స్థాయిలో మేధస్సుకు మంథని చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని పట్టణంలో డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్వర్క్‌లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీ వర్క్స్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికత పరంగా వారికి ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసుకుని వచ్చేందుకు మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైపింగ్, ఇన్నోవేషన్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను పరిశీలించేలా చూడాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. అదేవిధంగా గుంజ పడుగు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్‌లో 2.90 కోట్ల నిధులతో పీఏం కుసుమ్ కార్యక్రమం క్రింద చేపట్టనున్న సోలార్ ప్రాజెక్టు మంజూరి పత్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సంచాలకులు జోగేందర్, ఆర్.డి.ఓ. సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలతో అధిక దిగుబడి

విశాలాంధ్ర-జిల్లా బ్యూరో మహబూబాబాద్: వరి సాగు చేసే నేలలలో జీలుగు విత్తనాలు చల్లడం వల్ల భూమిలో సారం పెరిగి అధిక దిగుబడి రాబట్ట వచ్చునని మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని చిన్న గూడూరు మండల కేంద్రంలో ఆగ్రోస్ సెంటర్‌లో రైతులకు జీలుగు విత్తనాల ఆయన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్టె ను ప్రతి ఒక్క రైతు తన పొలంలో వరి సాగు కన్నా ముందు తప్పనిసరిగా వేసుకోవాలని అన్నారు. సహజసిద్ధమైన నత్రజని స్థాపన జరిగి రైతుకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పిడి డిఆర్డిఓ ఉమాదేవితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లా మంత్రి ద్వారా ఈ జిల్లాకు వచ్చే ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 55 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. రైతు రుణమాఫీ, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, వైద్యం, విద్య తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారం వచ్చిన ప్రతి దరఖాస్తుపై వివరాలు రిమార్కుల విభాగంలో నమోదు చేసి, దరఖాస్తుదారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని, వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజినల్ వ్యాధులపై వైద్య శాఖ ప్రజలకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకం : కలెక్టర్



విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన చట్టం భూభారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనీ జిల్లా మహిళా సమైక్య భవన్లో లైసెన్సు సర్వేర్లు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ వ్యక్తికి ఆధార లాగా భూమికి భూదార్ ఉందని, భూమిలోని ప్రతి కమతానికి మ్యాప్ కీలకం కావడంతో సర్వేయర్లు చాలా అవసరం అన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్ పని కీలకమని, భూమి క్రయ విక్రయాల్లో, భూ బదిలాయింపుల్లో, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, సరిహద్దుల నిర్ణయంలో, మ్యాపుల తయారీలో, సర్వేయర్ల కీలక భూమిక అన్నారు. జిల్లావ్యాప్తంగా 298 మంది లైసెన్సు సర్వేర్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 166 మందిని మొదటి దశలో శిక్షణ కార్యక్రమం అందిస్తున్నామన్నారు. మిగతా 132 మందిని రెండవ దశలో వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సర్వేయర్లు ఈ 50 రోజుల శిక్షణ కార్యక్రమంలో సాంప్రదాయ, నూతన, టెక్నాలజీ సర్వేలను నేర్చుకోవాలన్నారు. సర్వేలలో టెక్నాలజీని జోడించాలన్నారు. సర్వేయర్లు సర్వేలపై మంచి జ్ఞానాన్ని సంపాదించుకావాలన్నారు. రైతుల సమస్యలపై మీకు ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించబోతున్నారని వాటిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న సర్వేయర్లకు స్టేషనరీ ఫైల్‌లని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడి సర్వే ల్యాండ్ రికార్డు ఐనేష్, సంబంధిత అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - హుస్నాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈఎంఆర్ఐ, జిహెచ్ఎస్ సౌజన్యంతో నడుస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది సేవలు మరువలేనివని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన్ షాహిద్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 108 పైలెట్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదవశాత్తు రోడ్డు లేదా ఏదైనా ప్రమాదం సంభవిస్తే 108 సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రదేశానికి అత్యంత త్వరగా చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లే వరకు వైద్యసేవలు అందించడం గర్వకారణమన్నారు. రోగి ప్రాణాలు కాపాడేందుకు ఆ సమయంలో పైలట్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్, కొహెడ, అక్కన్నపేట మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - ములుగజిల్లా బ్యూరో : రైతులకు పంటలపై అనేక రకాల పద్ధతులపై అవగాహన కల్పించానని, ఉద్యాన పట్టు పరిశ్రమ ములుగు జిల్లా అధికారి జి. అనసూయ తెలిపారు. సోమవారం ములుగుజిల్లా కేంద్రంలోని రైతువేదిక వద్ద బదిలీపై హన్మకొండకు వెళ్తున్న జిల్లా అధికారి జి.అనసూయ ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ నేను గతంలో ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలో పనిచేసి, ములుగుకు బదిలీపై వచ్చానని, ములుగులో కొత్త రకాల పంటలకోసం రైతులు, ఎంతో ఆసక్తి చూపుతారని ఆమె అన్నారు. పంటలపై ములుగుజిల్లాలో ఉన్న రైతులకు ఎప్పటికప్పుడు, పంటలపై అవగాహన కలిపించామని పేర్కొన్నారు. కింది స్థాయి సిబ్బంది మంచిగా పనిచేస్తే, జిల్లా అధికారులకు, ప్రభుత్వంకు మంచి పేరువస్తుందని, నేను ఎక్కువగా పీల్డ్ వర్క్ మీదికి వెళ్లి, ప్రతిది నేను చూసేదాన్ని ఆమె అన్నారు. నేను హన్మకొండ జిల్లాకు బదిలీ పై వెళ్తున్నాను, నాకు ఏ విధంగా అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలు అందించారో, భూపాలపల్లి జిల్లా నుండి ములుగుకు బదిలీపై వచ్చిన అధికారి డి. సంజీవరావు కూడా, అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. అనంతరం భూపాలపల్లి జిల్లానుండి ములుగుకుబదిలీ పై వచ్చిన ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి డి. సంజీవ రావు మాట్లాడుతూ రైతులు వేసే పంటలపై, రైతులకు అవగాహన కల్పించాలని, కింది స్థాయి అధికారులు, సిబ్బంది సహాయ సహాయకారాలు కృషి ఉంటే, ఆ సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న జిల్లా అధికారికి సిబ్బంది శాలువా, బొకేలతో సన్మానం చేశారు. బదిలీ పై ఇక్కడికి వచ్చిన ఉద్యాన, పట్టుపరిశ్రమ జిల్లా అధికారి డి. సంజీవరావుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అధ్యక్షతన పాఠశాల ఏఏపిసి చైర్మన్ ఇంజమూరి శ్రావణి ముఖ్య అతిథిగా హాజరు కాగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమ భావన సంఘాల ప్రతినిధులు, అంగన్వాడి టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ పాఠశాలలో సుశిక్షులు అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందం నాణ్యమైన విద్య అందిస్తున్నారని, డిజిటల్ తరగతుల బోధన క్రమశిక్షణ విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అందుతుందని, కంప్యూటర్ విద్య సైతం తిరిగి ఈ విద్యా సంవత్సరం నుంచి మొదలవుతుందని అన్ని సదుపాయాలు ఉచితంగా అందుతాయని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని కార్యక్రమాలు ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమం పీఎంశ్రీ స్కీమ్ ద్వారా పాఠశాలలో అందిస్తున్నామని పదవతరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న "మన ఊరి బడి మనందరి బడి జడ్.పి.హెచ్.ఎస్ నేరేడుచర్ల నందు విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఇంజమూరి ఉపేంద్ర, జయమ్మ సమభావన సంఘాలనుండి కాలం నాగమణి ఇంజమూరి రోజా టి.నాగలక్ష్మి వై కళ్యాణి పట్టణ ఆర్పీ ఇంజమూరి సరిత నాగమణి ఉపాధ్యాయులు ఎం యాదగిరి ఎం బాలు ఎస్.కె లాల్ సాహెబ్ సరస్వతి వెంకటేశ్వర్లు ఉపేందర్ సంజన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూభారతి విధి విధానాలపై లైసెన్సుడ్ సర్వేయర్లకు

శిక్షణా తరగతులు ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో ఎంపిక చేసిన 426 మంది లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన భూభారతి అంశాలపై శిక్షణా తరగతులు ప్రారంభమైయ్యాయి. కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ మైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లైసెన్సు సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే చేయడం కోసం లైసెన్స్ సర్వేయర్లగా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకొని, మెలుకువలు తెలుసుకొని రాణించాలని సూచించారు. ప్రభుత్వ కొత్త భూ రికార్డుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మొత్తం 50 రోజుల పని దినాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం క్షేత్రస్థాయిలొ తీసుకువెళ్లి సర్వేపై శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థుల విద్యా అర్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేక కౌంటర్ల ద్వారా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అభ్యర్థులకు సర్వేకు సంబంధించిన గొలుసులు, క్రాస్ స్టాఫ్, క్యాలిక్యులేటర్, స్కేల్, పెన్సిల్, నోట్‌బుక్స్‌తో పాటు స్టడీ మెటీరియల్ కు సంబంధించిన కిట్లను వారికి అందించారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కళాశాల ఏడి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డే సమస్యలు త్వరగా పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లాలోని భాధిత ప్రజల సమస్యల పట్ల విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ తన కార్యాలయానికి వచ్చిన బాధితులతో ఓపిగ్గా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి వారికి న్యాయం చేకూర్చాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

టేకులపల్లి స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు టేకులపల్లి పోలీస్ స్టేషన్ ను సోమవారం ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది తొమాట్లాడి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతొ మర్యాదగా ప్రవర్తించి, వారికి న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు, సిబ్బందికి చెప్పారు. ఈ పోలీస్‌స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కొందరు బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కారానికి విచారణ చేపట్టి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రిపోర్టర్ బత్తులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు పట్టణంలోని సీనియర్ జర్నలిస్ట్ బత్తుల రాధాకృష్ణ ను మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పరామర్శించారు. ఈనెల 12న రాధాకృష్ణ మాతృమూర్తి గతించారు. విషయం తెలుసు కున్న ఆమె సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. రాధాకృష్ణ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తూ అతని బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, టిబిజికెఎస్ సెంట్రల్ నాయకుడు ఎస్. రంగనాథ్, మాజీ వార్డు కౌన్సిలర్ జెకె శ్రీనివాస్, నాయకులు నబి, జబ్బార్, దేరంగుల పోషం, ఘాజీ, కడకంచి వీరాస్వామి, గిన్నారపు రాజేష్, రామ్‌లాల్, హరిప్రసాద్ యాదవ్, పూధురి లక్ష్మి నర్సయ్య, బజారు ఆంజనేయులు, సత్తాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి : పీవో

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : ఏటూరునాగారం ఐటిడిఏ గిరిజన దర్బార్‌లో అందచేసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా సెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ దర్బార్‌కు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలంలోని, గ్రామాలకు చెందిన గిరిజనులు, వివిధ సమస్యలపై పీఓకు దరఖాస్తులు అందచేశారు. ఈ సందర్భంగా పిఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా, గిరిజనుల దరఖాస్తులు పరిష్కరించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజ్ కుమార్, జిసిసి డియం ప్రకాష్, జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

నీతి ఆయోగ్ దాచిన లెక్కలు

జపాన్‌ను అధిగమించి మన దేశం ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సమావేశంలో వెల్లడించారు. సమాచారం తెలుసుకునే హక్కు ప్రజలకు ఉన్న మాట నిజమే. మన దేశంలో సమాచారం తెలుసుకోవడానికి ఒక చట్టమే ఉంది. అయినా ప్రభుత్వం ఇవ్వదలచుకున్న సమాచారమే మనకు ఎక్కువగా అందుబాట్లోకి వస్తూ ఉంటుంది. ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే సమాచారాన్ని తొక్కి పెట్టడానికి అధికారంలో ఉన్నవారు ఏ ప్రయత్నాన్నీ వదలరు. కనీసం దేశంలో నిరుద్యోగులు ఎంత శాతం ఉన్నారు అని ప్రభుత్వ విభాగాలే సమకూర్చిన సమాచారాన్నే చాపకింద కప్పేస్తుంటారు. జపాన్‌ను అధిగమించి మనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థల దృష్టితో చూస్తే నాల్గవ స్థానానికి చేరుకున్నామని నీతి ఆయోగ్ సమావేశాల సందర్భంగా వెల్లడించారు. ఈ ఏడాది మన స్థూల జాతీయ ఉత్పత్తి 4.187 ట్రిలియన్ డాలర్లు దాటుతుందట. ఇది జపాన్ ఆర్థిక వ్యవస్థను దాటేయడం అంటున్నారు. అంటే 4 ట్రిలియన్ల స్థాయిలో బలోపేతంగా ఉందని నీతీ ఆయోగ్ ప్రధాన కార్యనిర్వహణాధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలియజేశారు. అమెరికా, చైనా, జర్మనీ తరవాత స్థానం తమేదేనని, ఈ ప్రగతి పథం ఇదే వేగంతో కొనసాగితే వచ్చే మూడేళ్లలోనే ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా తయారవుతామట. 2047కల్లా మనం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుతామని ప్రధానమంత్రి మోదీ చెప్తున్నారు. కాంగ్రెస్‌కు అరవై ఏళ్ల అధికారం ఇచ్చారు. నాకు అరవై నెలలు ఇవ్వండి చాలు అని మోదీ ప్రధానమంత్రి కాకముందు చెప్పేవారు. ఇప్పుడేమో మనం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడానికి 2047 దాకా ఆగమంటున్నారు. అప్పటికల్లా అందరికీ ఇల్లు, అందులో మరుగుదొడ్డి సదుపాయం సమకూరుతాయంటున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత సగం జనాభాకు ఏదో ఒక రీతిలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోంది, లేకపోతే రుణాలు ఇప్పిస్తున్నామని అలాంటప్పుడు నిరుద్యోగం ఎక్కడిదని మోదీ ప్రభుత్వం ఎదురు ప్రశ్నిస్తోంది. 80 కోట్ల జనాభాకు నెలకు అయిదేసి కిలోల ధాన్యం అందిస్తుండగా ఆకలి ఎక్కడిదన్నది మోదీ ప్రభుత్వ సందేహం. అంటే ఏదో ఒక రీతిలో ఆర్థిక సహాయమూ అందుతోంది, ఆకలీ తీరుతోందిగా అన్నది ప్రభుత్వం వాదన. కానీ మోదీ హయాంలోనే 11 ఏళ్ల కాలం గడిచినా 80 కోట్ల మంది ఇంకా ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఎందుకు బతకాల్సి వస్తోందో మాత్రం ఈ ప్రభుత్వం చెప్పదు. ఈ దేశ ప్రజల కోసం తాము వెచ్చించినంత డబ్బు మునుపు ఏ ప్రభుత్వమూ వెచ్చించలేదని కూడా మోదీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఈ వాదనలు అస్తవ్యస్తమైనవిగా కనిపించవచ్చు. కానీ నీతీ ఆయోగ్ ప్రకటించిన గణాంకాలను చూస్తే ఆ గణాంకాల వల్ల లబ్ధి పొందింది ఎవరు అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం మన ఆర్థిక వ్యవస్థ 0.1 శాతం కన్నా తక్కువ స్థాయిలో జపాన్ ఆర్థిక వ్యవస్థను అధిగమించిందనుకోవాలి. మన్‌మోహన్ సింగ్ హయాంలో స్థూల జాతీయోత్పత్తి 8 శాతం దాటిన సందర్భాలూ ఉన్నాయి. స్థూల జాతీయోత్పత్తి ఎంత పెరిగినా దీనివల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారో ఆలోచించాల్సిందే. స్థూల జాతీయోత్పత్తి 2014లో 1.8 ట్రిలియన్ డాలర్లు ఉంటే ఇప్పుడది 4.1 ట్రిలియన్ డాలర్లకు పెరిగిన మాట నిజమే. కానీ ఈ పెరుగుదల 2.3 ట్రిలియన్ డాలర్లు ఉందనుకుంటే ఇందులో 62 నుంచి 68 శాతం కార్పొరేట్లకే ప్రయోజనం కల్గించింది. 2013లో కార్పొరేట్ సంస్థల మొత్తం సంపద కన్నా ఏడాది మోదీ పాలనలో ఆ సంపద అమాంతం పెరిగింది. అక్కడి నుంచి కార్పొరేట్ల సంపద పెరుగుతూనే వస్తోంది.

మన ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడ్తోందని నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా 80 కోట్ల మందికి ఉచిత ధాన్యం, మహిళలకు ఎల్‌పీజీ సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్మాణం, ముద్ర యోజన లాంటి ప్రభుత్వ పథకాలవల్ల నిజంగానే దేశవాసుల పరిస్థితి కార్పొరేట్ల లాభాల్లాగా అమాంతం మెరుగుపడిపోయి ఉండాలి. అలా జరగలేదు. దీనికి స్థూల జాతీయ ఉత్పత్తి ఎంత పెరిగిందన్న గణాంకాలు సమాధానం చెప్పవు. ప్రభుత్వ సాయం అవసరమైన వారి సంఖ్యా పెద్దదే. కార్పొరేట్లు నొల్లుకుంటున్న లాభాలు అంతకన్నా అనేక రెట్లు ఎక్కువ. జన జీవితం అమాంతం మారకపోవడానికి ఇదే కారణం. భారత కార్పొరేట్ల ఖ్యాతి ప్రపంచంలో నిరుపమానమైందే. అలాగే భారత్‌లో పేదరికం కూడా అనేక పేద దేశాలకన్నా ఎక్కువే. ఇది అభివృద్ధి పథంలో ఉన్న వైపరీత్యం. ఇది కార్పొరేట్ల లాభాలు పెంచడానికి ఎంచుకున్న అభివృద్ధి మార్గం. కొన్ని కఠిన వాస్తవాలను పరిశీలిస్తే తప్ప అసలు చిత్రం రూపు కట్టదు. మోదీకి అత్యంత సన్నిహితుడైన అదానీ సంపద 2.6 బిలియన్ డాలర్లు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత అది అమాంతం 7.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే తరహాలో మోదీ అధికారంలోకి రాక ముందు 2013లో అంబానీ సంపద 21 బిలియన్ డాలర్లు అయితే మోదీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అంబానీల సంపద 23 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం అదానీ సంపద 116 బిలియన్ డాలర్లు. పదేళ్లలో అదానీ సంపద 110 బిలియన్ డాలర్లకు అమాంతం పెరిగిపోయింది. అంబానీ దగ్గరకొస్తే 2013లో 21 బిలియన్ డాలర్లు ఉన్నది 2024 నాటికి 119 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే అంబానీ సంపద 98 బిలియన్ డాలర్లు ఒక్క మోదీ హయాంలో పెరిగిపోయింది. ఇద్దరి సంపద కలిపితే పదేళ్లలో 200 బిలియన్ డాలర్లు లేదా 18 లక్షల కోట్ల రూపాయలు పెరిగిపోయింది. మన్మోహన్ సింగ్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు అనుకూలురే కానీ ఆయన హయాంలో అంబానీ, అదానీల సంపద వాయు వేగంతో పెరగలేదు. సంపద అనూహ్యంగా పెరిగింది కేవల అంబానీ, అదానీది మాత్రమే కాదు. రాధాకృష్ణ దమాని, దిలీప్ సింఘ్వీ, పల్లోంజి మిస్త్రీతో మొదలు పెట్టి మరో 17 మంది సంపదా ఇదే రీతిలో పెరిగిపోయింది. అజీం ప్రేంజీ సంపద 2014లో 16.4 బిలియన్ డాలర్లు అయితే 2024 నాటికి 12.4 బిలియన్ డాలర్లకు కుంచించుకు పోయింది. గోద్రేజ్ సంపదా అలాగే తగ్గి పోయింది. ఇలా తగ్గిన కార్పొరేట్ కంపెనీల జాబితా నామ మాత్రమైందే. బ్యాంకుల దగ్గర అప్పులు తీసుకుని బాకీ తీర్చకుండా మొరాయిస్తున్నవారు, విదేశాలకు ఉడాయించిన వారూ ఎక్కువగానే ఉన్నారు. అయినా ప్రభుత్వం 16 లక్షల కోట్ల రూపాయల మేర వారి మొండి బాకీలను మాఫీ చేసేసింది. ఇది 25 లక్షల కోట్ల దాకా ఉండొచ్చునంటున్నారు. ఈ మొత్తం బ్యాంకులలో డబ్బు దాచుకున్న వారి జేబుల్లోంచి లాగేసిందేగా!

నేటి భారతం

చింతపట్ల సుదర్శన్

గోడకు ఆనుకుని పడుకున్న డాంకీ వీపు మీద మట్టి పెళ్ల ఒకటి వచ్చిపడ్డంతో ఉలిక్కిపడి గొంతు విప్పింది. ఆ పక్కనే ఉన్న డాగీకి నిద్ర దొబ్బేసింది. దీనికి పాడే కాలం వచ్చినట్టుంది. తెల్లారనే లేదు రాగాలాపన లంకించుకుంది. పక్కవాడు సుఖపడితే చూసి ఓర్వలేని మనుషుల తత్వం దీనికీ వచ్చినట్టుంది అనుకుంటూ ఏంటి బ్రో ఈ మధ్య సంగీత సాధన మానేశావు కదా మళ్లీ ఏ వాగ్గేయకారుడైనా కల్లో కనిపించి 'పాట పాడవా గాడిదా' అని కీర్తన వినిపించాడా? అన్నది.

నాది పాట కాదు. ఘోష. వీపు మీద గోడ విదిలించి కొట్టిందో మట్టి పెళ్ల. కొంపదీసి గోడ కూలిందా రెండు నాలుక్కాళ్ల జీవులు మటాష్ అంతే. ఆ తర్వాత దిగ్భ్రాంతి వ్యక్తం

రంగస్థలం

చేసేవాళ్లు, ఎవరూ ఉండరు అంది డాంకీ లేచి నిలబడుతూ.

అవునా పాటనుకున్నాను సారీ ఏడుపు అన్నమాట. నీ ఏడుపూ పాటలాగా ఉందంటే నువు గాయక శిఖామణివే అంది డాగీ. రోమ్ నగరం తగలబడుతుంటే వాడెవడో ఫిడేల్ వాయించేట్ట అలాగుంది నీ రెస్పాన్స్ అంది డాంకీ. రాజకీయ నాయకుల స్వభావమే అది. జనం ఆరాటాన్ని అరుపుల్ని వినడానికి వాళ్లకు చెవులుండవు. ఇంతకీ మన ఈ కూలిన కొంప 'రోమ్' నగరమెలాగయ్యింది అంది డాగీ. విషయం అర్థం చేసుకో. గోడలో నుంచి మట్టి రాలిపడితే గోడ కూలుతుందంటారు. ఇక్కడ ఉందామా పలాయనం చిత్తగిద్దామా అది చూడు ముందు అని డాంకీ అంటే గాడిద ఆనుకుని ఉన్న గోడవైపు పరీక్షగా చూసింది డాగీ. గోడ మొదట్లో ఉన్న కన్నంలోంచి ఓ జీవి తొంగి చూస్తుండట గమనించి 'భవ్వు' మంది.

ఉన్నట్టుండి అరుపు లంకించుకుంటున్నావు పాకిస్థాన్‌కు భారత్ షాక్ అని పదేపదే పేపర్లో చదివా. ఎవరికి ఏది షాకో, అసలు షాక్ అనగానేమో ఇప్పటికీ అర్థం అవలా కానీ ఈ డాంకీకి, డాగీ షాకేంటో చెప్పి అరుపు అంది విసుక్కుంటూ డాంకీ. నో వర్రీస్ డాంకీ మన గోడ 'హెల్త్' కి వచ్చిన ప్రాబ్లం ఏమీలేదు. గోడలో కన్నం చేసి లోపల సెటిలయ్యింది ఓ జీవం. అది కన్నంలోంచి తొంగి చూస్తుంటే ఎందుకైనా మంచిదని సభల్లో ప్రతిపక్షం వాళ్లు తామూ ఉన్నామని చెప్పుకోడానికి అరుస్తారే, అలా ఓ 'ఝలక్' ఇచ్చా. ఇప్పుడు కన్నంలోని ప్రాణికి షాక్ ఇచ్చా. అది బయటకు రాదు. లోపల కుదురుగ్గా ఉండలేదు అంది డాగీ. గోడ కన్నంలో ప్రాణా? ఎవరబ్బా. ఈ మధ్య ఇంట్లో ఎలకలు తిరుగుతున్నాయి. వాటి కోసం నల్లపిల్లి గోడ ఎక్కి దూకుతున్నది. ఎలకేనా? కనపడిందా అంది డాంకీ. అంత పెద్ద కన్నం తవ్వింది ఎలక కాదనుకుంటా, బాగా తిని బలుస్తుందే దాన్నేమంటారో గుర్తు రావడంలేదు అంది డాగీ. జెయింట్ సైజ్ ఎలకా? దాన్ని పందికొక్కు అంటారులే. అది పందికొక్కా లేక బాగా తిని బలిసిన ఎలకా సరిగ్గా చూసి చెప్పు అంది డాంకీ.

నాకేం తెలుస్తుంది డాంకీ బ్రో. మనుషులు వేసుకునే డ్రస్సుని బట్టి, పెట్టుకునే టోపీలని బట్టి వాళ్ల చేతుల్లో జండాల్ని బట్టి, వాళ్లు అరిచే అరుపుల్ని బట్టి వాళ్లు అధికార పక్షం సభ్యులో, ప్రతిపక్షం సభ్యులో, ఎవరెవరు ఏ పార్టీ మనుషులో చెప్పగల సమర్థుడివి నువ్వు అంతేకాదు ఎవరు ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి జంపు చేశారో, చేస్తారో కూడా చెప్పగలిగే ఆరోజ్ఞానం కూడా ఉంది నీకు అంది డాగీ. తెల్లారుతున్నది కదా కన్నంలోకి కాలు విసిరి చూస్తా అని డాగీ ఆ పని చేసింది. కన్నంలోని ప్రాణి బతుకు జీవుడా అంటూ బయటికి ఉరికి వచ్చి ఇంటి లోపలికి గెంతింది.

అర్థమైంది. ఇది ఎలకే. కానీ అడ్డమైన తిండీ తిని పందికొక్కులా బలిసింది అని డాంకీ అంటుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి. ఏమిటి పొద్దున్నే బలిసింది అనే మాట వినిపడింది అన్నాడు. ఏం లేదన్నా లోపల చేరిన చిట్టెలకలు ఏం తింటున్నాయో కాని ఇప్పుడు బాగా ఒళ్లు చేసి గోడ కూలే కన్నాలు చేస్తున్నవి. అసలుకే మోసం వచ్చేట్టుంది అంది డాంకీ. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందంటారు. నిజమే. చిట్టి ఎలుకల్లా పాలిటిక్సులో ప్రవేశించే వాళ్లంతా క్రమంగా అడ్డమైన చెత్తాచెదారం తెగ మెక్కి పందికొక్కులుగా మారుతున్నారు. ఈ దేశమనే గోడకు కన్నాలు పొడిచి చివరకు ఏం చేస్తారోనని భయం వేస్తోంది అన్నాడు అబ్బాయి.

నిజమే బ్రో. చూస్తుంటే రాజకీయం ఒక లాభసాటి వ్యాపారమని, ప్రజల్ని దోపిడీ దొంగల్లా దోచుకుని దొరల్లా బతకొచ్చని అనుకుంటున్న వాళ్ల సంఖ్య పెరిగి పోతున్నది. ప్రజల్ని నిజంగా ప్రేమించే వాళ్లు, ప్రజలకి సేవ చేయాలనుకునే వాళ్లూ కరువైపోయారు. దేశ భక్తి ఉత్తి నినాదాలలోనే హోరెత్తుతున్నది అంది డాంకీ. ఎలుకలు పందికొక్కులయితే నల్లపిల్లి తెల్ల ముఖం వెయ్యాల్సిందే. వాటిని పట్టుకోడం, అదుపులో పెట్టడం ఎవరి తరమూ కాదు మరి అంది డాగీ.

భారత్ ఖోదో × భారత్ ఖోజో

ఆర్వీ రామారావ్

“నేను చదువు రీత్యా ఆంగ్లేయుడిని, సంస్కృతి రీత్యా ముస్లింను, అనుకోకుండా హిందువును” అని నెహ్రూ తానే స్వయంగా చెప్పుకున్నారు అని ఓ వాదన పదే పదే వినిపిస్తూ ఉంటుంది. అంటే నెహ్రూకు భారతీయ తత్వం, భారతీయ ఆత్మ అంటే ఏమిటో తెలియదని చెప్పడానికి ఈ వాదన చేస్తూ ఉంటారు. కానీ ఇలాంటి పనికి మాలిన మాటలు నెహ్రూ ఎన్నడూ చెప్పలేదు. హిందూ మహాసభ నాయకుడు ఎన్‌జీ ఖరే ఈ మాటలను నెహ్రూకు అంటగట్టారు. నెహ్రూ రాసిన రచనల్లో ఈ మాటలు ఎక్కడా కనబడవని నెహ్రూ మీద సాధికారికంగా మాట్లాడగలిగిన జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పురుషోత్తం అగర్వాల్ తీవ్రంగా ఖండిస్తూ ఉంటారు. ప్రసిద్ధ పత్రికా రచయిత నెహ్రూ మీద రాసిన పుస్తకంలో కూడా ఈ వాదనను గట్టిగా ఖండించారు.

ప్రతి మసీదు కింద శివ లింగాన్ని వెతికే ధోరణి ప్రబలంగా ఉన్న సమయంలో నెహ్రూను విమర్శించ డానికి వాటంగా వినియోగించుకుంటూ ఉంటారు. చదువు పూర్తయ్యేదాకా నెహ్రూ ఇంగ్లాండ్‌లో పెరిగిన మాట వాస్తవమే. ఆయనకు భారతీయ ఆత్మ బాగా తెలుసును అని చెప్పడానికి ఆయన రాసిన “డిస్కవరీ ఆఫ్ ఇండియా” నిరూపిస్తోంది. చదువు పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ నుంచి తిరిగి వచ్చిన దశలో ఆయనకు భారత్ గురించి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. కానీ భారతీయ ఆత్మను పట్టుకోవడానికే ఆయన “డిస్కవరీ ఆఫ్ ఇండియా” రాశారు. ఇందులో ప్రాచీన భారత చరిత్ర నుంచి స్వాతంత్ర్యం వచ్చే దాకా దేశం గురించి అనేక అంశాలను ప్రస్తావించారు.

మన దేశానికి మహత్తరమైన చరిత్ర, శాస్త్ర పరిశోధనల అనుభవం ఎప్పటి నుంచో ఉంది. బ్రిటిష్ వారు, జర్మన్ దేశస్థులు మన దేశం గురించి రాసిన అంశాలను తలకెత్తుకునే వారూ ఉన్నారు. ఈ రాతలను బొత్తిగా అంగీకరించని వారూ ఉన్నారు. “మన రచయితలు చాలా వరకు మన గురించి విదేశీ పండితులు రాసిందంతా చెప్పడానికి ప్రయత్నించారు. ఈ ప్రభావం నుంచి నేనూ కొంతమేరకు తప్పించుకోలేక పోయాను. విదేశీయుల రచనల్లోంచి మన దేశాన్ని మన సంస్కృతిని పొగిడిన విషయాలను, తెగిడిన అంశాలను ఉటంకిస్తూ ఉంటారు” అని నెహ్రూ “డిస్కవరీ ఆఫ్ ఇండియా” గ్రంథంలో ఒక పాదపీఠికలో అంటారు. భారత్ ఖోదో ధోరణి విస్తారంగా పరుచుకున్న సమయంలో “డిస్కవరీ ఆఫ్ ఇండియా”ను అధ్యయనం చేస్తే తప్ప భారత్ ఆత్మను పట్టుకోవడానికి ఆ గ్రంథంలో నెహ్రూ చేసిన ప్రయత్నం అర్థం కాదు.

క్విట్ ఇండియా ఉద్యమం నేపథ్యంలో అహ్మద్‌నగర్ జైలులో ఉండగా 1942-1945 మధ్య నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా రాశారు. ఇంత భారీ గ్రంథం రాయడానికి జైలులో ఆయనకు అందుబాటులో ఉన్న పరామర్శక గ్రంథాలూ తక్కువే. నెహ్రూ హిందీ, ఉర్దూ కూడా సరిగ్గా మాట్లాడగలిగే వారు కాదు అని చెప్పే వారూ ఉన్నారు. ఆయనకు ఈ రెండు భాషలకన్నా ఇంగ్లీషు ఎక్కువ తెలిసి ఉండొచ్చు. ఆయన హిందుస్థానీ భాషల్లో చేసిన ప్రసంగాలు అనేకం ఉన్నాయి. బహిరంగ సభల్లో ఎక్కువగా మాట్లాడింది ఈ భాషలోనే. నెహ్రూ శిక్షణ పొందిన చరిత్రకారుడు కాదు. కానీ ఆయన రాసిన “డిస్కవరీ ఆఫ్ ఇండియా”







> భారతీయ మత భావనలో ఉన్న వైశాల్యం చాలా ఎక్కువే అయినా కుల వ్యవస్థ ఆ భావనను ఇరుకు చట్రంలో బిగించింది. మన సంస్కృతిలోని విశిష్టతలను వివరించడంతో పాటు వైరుధ్యాలను కూడా నెహ్రూ వింగడించారు. భిన్న దశలను అర్థం చేసుకోవడానికి, సవిమర్శనాత్మకంగా పరిశీలించి ఒక దేశం లేదా ఒక జాతిని అర్థం చేసుకోవడానికి అనుసరించవలసిన మార్గం ఏమిటో చెప్పడానికి నెహ్రూ బలమైన ముద్ర వేశారు.

అనేక మంది భారత చరిత్రకారులకు స్ఫూర్తినిచ్చింది. ఈ విశాల విశ్వానికి దరి ఉండొచ్చు కానీ మూర్ఖుల ఆత్మవిశ్వాసానికి దరి లేనట్టే దారీ తెన్నూ ఉండవు. “డిస్కవరీ ఆఫ్ ఇండియా” భారత సంస్కృతి, చరిత్ర, సంస్కారం, హిందూ పరంపర అంశాలలోని లోపాలోపాలు నెహ్రూకు బాగా తెలుసునని “డిస్కవరీ...” రుజువు చేస్తుంది.

ఒకే భాష, ఒకే మతం, ఒకే జాతి, ఒకే సంప్రదాయం అని వాదించే వారికి ఆ భావన పశ్చిమ దేశాలదని తెలియకపోతే చేయగలిగింది ఏమీ లేదు. నిజానికి ఈ భావనకు రెండువందల ఏళ్లకన్నా ఎక్కువ చరిత్ర లేదు. ఒక సారీ నెహ్రూ అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ మీరు ముస్లింలు కావచ్చు. నేను హిందువును కావొచ్చు. అంతిమంగా మనందరం హిందుస్థానీయులం (భారతీయులం) అన్నారు. ఈ గ్రంథం శ్రద్ధగా చదివితే భారతీయ ఆత్మను ఆవిష్కరించడానికి నెహ్రూ చేసిన ప్రయత్నం స్పష్టంగా గోచరిస్తుంది. “డిస్కవరీ ఆఫ్ ఇండియా” లో నెహ్రూ ప్రాచీన భారత్ నుంచి ఆధునిక భారత్ దాకా వివిధ దశలను ఫక్తు భారతీయుడిగా వివరించారు. భారతీయ మత భావనలో ఉన్న వైశాల్యం చాలా ఎక్కువే అయినా కుల వ్యవస్థ ఆ భావనను ఇరుకు చట్రంలో బిగించింది. మన సంస్కృతిలోని విశిష్టతలను వివరించడంతో పాటు వైరుధ్యాలను కూడా నెహ్రూ వింగడించారు. భిన్న దశలను అర్థం చేసుకోవడానికి, సవిమర్శనాత్మకంగా పరిశీలించి ఒక దేశం లేదా ఒక జాతిని అర్థం చేసుకోవడానికి అనుసరించవలసిన మార్గం ఏమిటో చెప్పడానికి నెహ్రూ బలమైన ముద్ర వేశారు.

జాతీయోద్యమ కాలం నాటి నాయకులు సెక్యులరిజం, మతతత్వం అన్న రెండు ద్వంద్వాల గురించి ఎన్నడూ మాట్లాడలేదు. వారు ప్రస్తావించిందల్లా మతతత్వం-జాతీయవాదం గురించే. చిక్కెక్కడంటే ఇప్పుడు జాతీయవాదాన్ని గుత్తకు తీసుకున్న వారు ఆ భావాన్నే సంకుచితం చేసేశారు. నెహ్రూ చెప్పిన సెక్యులరిజం పాశ్చాత్య దేశాల సెక్యులరిజానికి భిన్నమైంది. పాశ్చాత్య దేశాలలో సెక్యులరిజం అన్న భావన రాజ్య వ్యవహారాలపై మతం జోక్యాన్ని ఎదిరించడానికి చెలామణిలోకి వచ్చింది. నెహ్రూ భావన ఇంతకన్నా చాలా విశాలమైంది. రాజ్య వ్యవహారాలలో ఏ రూపంలోనూ మత ప్రమేయం ఉండకపోవడమే నెహ్రూ దృష్టిలో అసలైన సెక్యులరిజం.

టీడీపీ పునర్ వైభవానికి 'మహా' కసరత్తు

చెన్నుపాటి రామారావు

మహానాడు...తెలుగుదేశం అభిమానులకు, ప్రేమికులకు అదో గొప్ప అనుభూతి. ప్రతి యేటా నిర్వహించే ఈ పార్టీ పండుగ కోసం పార్టీ శ్రేణులు అర్రులు చాస్తుంటారు. టీడీపీ స్థాపించిన నాటి నుంచి ఈ సందర్భాన్ని గుర్తుకు తెస్తూ కార్యక్రమం నిర్వహణలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని నింపేందుకు సకల ఏర్పాట్లు గావించారు. భారతదేశ రాజకీయ చిత్రాన్ని సమూలంగా మార్చివేసి ప్రపంచ పటంలో తెలుగు జాతి పతాకాన్ని రెపరెపలాడించిన, నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆయన జన్మదినాన్ని ప్రతి యేటా మహానాడు రూపంలో మహోత్సవంగా జరుపుకుంటుంది. ఈ ఏడాది మహానాడును రాయలసీమకే రాజకీయ పట్టుగొమ్మగా భావించే కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. గత మహానాడులకు భిన్నంగా గుర్తుండిపోయేలా మహానాడు ఉండాలని బృహత్ ప్రణాళికలతో అధికార టీడీపీ రూప కల్పన చేసింది. పసుపు పండగ ద్వారా తమ ఆరాధ్య దైవం ఎన్టీఆర్‌ను నెమరు వేసుకోవాలని తమ్ముళ్లు ఉవ్విళ్లూరు తున్నారు. ఆటుపోట్లు, అల్లర్లు, విధ్వంసాల నుంచి పెల్లుబుకిన ఉత్సాహంతో కార్యకర్తలు దృష్టి పెట్టారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పార్టీ తీర్మానాలతోపాటు రానున్న రోజుల్లో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపైనా శోధన చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో భిన్న రాజకీయ పరిస్థితుల మధ్య సమతుల్యం సాధించేందుకు ఈ మహానాడు వేదిక నుంచే పార్టీ శ్రేణులకు, యంత్రాంగానికి అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేస్తారు.

సాంకేతిక పురోగతి, మారిన పరిస్థితులను గమనంలోకి తీసుకుని ఈ మహానాడు ద్వారా గొప్ప సందేశాన్ని ఇవ్వాలని టీడీపీ భావిస్తోంది. గత పాలనా కాలంలో ప్రజలకు చేసిన మేలు, ఇప్పుడున్న తాజా రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై అందరినీ ఆలోచింపజేసేలా పార్టీ పునర్ వైభవానికి మహానాడును వేదికగా మలచుకోవాలన్నదే ఇప్పుడు తెలుగుదేశం ముందున్న ప్రధాన కర్తవ్యం. టీడీపీలో తొలి తరానికి ఎన్టీఆర్ ఊపిరిలూదితే, మలితరానికి చంద్రబాబు మార్గదర్శిగా నిలిచారు. గతంలో పార్టీ నిర్వహణకు, ఇప్పటి పరిస్థితులకు బహు వైవిధ్యం ఉంది. యువత కొత్త ఆశలతో ముందడుగు వేస్తున్నారు.

సుశిక్షితులైన పాతతరం నేతలతోపాటు స్టెప్పులేస్తున్న యువ నేతలకు ప్రోత్సాహం కలిగేలా పార్టీ నడత ఉంటే సత్ఫలితాల సాధన వినిపిస్తోంది. సుదీర్ఘకాలం పార్టీని అంటిపెట్టుకుని జెండాలు మోసిన వారుంటారు. దాన్ని గుర్తించినప్పుడే పార్టీ మనుగడ ఇనుమడిస్తుంది. టీడీపీలో ప్రస్తుతం ఇదే చర్చనీయాంశమౌతోంది. కాలం గడుస్తోంది. లక్ష్యాలు మాత్రం బారెడు. చేయాల్సింది లెక్కలేనంత. టీడీపీ ప్రభుత్వం ముందు ముందు నెరవేర్చాల్సిన బృహత్ కార్యాలకు, పార్టీ పునర్ వైభవానికి కార్యోన్ముఖం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. కొత్త రాజధాని, అభివృద్ధి అడుగులు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం తదితరాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. ఇప్పుడే అసలు కీలకాంశం తెరపై తేలియాడుతోంది. సొంత పార్టీ తెలుగుదేశంపై ఆయన దృష్టి పెట్టాల్సిన సమయం తరుముకొస్తోంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వెసులుబాటు కల్పించుకొని రకరకాల ఆలోచనలతో పార్టీని ముందుకు తీసుకెళ్తున్నందుకు నేతలు, కార్యకర్తలు నిండు మనసుతో పనిచేయాలి. ఎందువల్లనంటే పార్టీ నిర్వహణలో అపార అనుభవమున్న నాయకుడు ఆ పార్టీ దిశా నిర్దేశకుడు కావడం కలిసొచ్చిన అంశం. వాస్తవానికి 40 ఏళ్లపాటు పార్టీని నిత్య స్రవంతిలో నిలపడం, ప్రతిపక్ష నేతగా 10 ఏళ్లు ఉండటం. గత చరిత్రను పరిశీలిస్తే సుదీర్ఘకాలం ఏ పార్టీకైనా అలా నడపడం అంత తేలికేమీ కాదు.

టీడీపీ నడుస్తున్న చరిత్రపై అంతర్గతంగా ఎన్నో విశ్లేషణలున్నాయి. పార్టీ వాళ్లు అధికారంలో కొచ్చి దాదాపు సంవత్సరం కావస్తోంది. ఈ సందర్భంగా కొంత సమీక్ష కూడా అనివార్యమే. పార్టీ పరంగా చేసిందీ, చేస్తున్నదీ కొంతేనని సూక్ష్మ పరిశీలకుల అభిప్రాయంగా ఉంది. గత పాలకుల నిర్వాకంతో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, అష్టకష్టాలు పడ్డామని అనేక వేదికల్లో పార్టీ కార్యకర్తలు ఆవేదన చెందడం గమనార్హం. వీటికి తోడు ప్రత్యర్థి పార్టీ నేతలే కొన్ని చోట్ల టీడీపీ పంచన చేరడం, పెత్తనం చెలాయించడం జరుగుతోందని అవన్నీ మరచి పదవుల్లో, పంపకాల్లో కార్యకర్తలకు న్యాయం జరగటం లేదని ఫిర్యాదులు రావడం పేర్కొనదగినది. పార్టీలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టాలన్నది కొందరు నేతల అభిప్రాయంగా ఉంది.

ప్రజావసరాలు అందులో కీలక రంగాలైన వైద్యం, విద్య, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, రవాణా, నగర పాలన, స్థానిక పాలన...ఇలా చెప్పుకొంటూ పోతే చాలా ఉన్నా...ఇవే అసలు ఏ పార్టీకైనా ప్రభావం చూపే అంశాలు. ఈ రంగాలపై అప్పుడప్పుడైనా క్షేత్రస్థాయి అధ్యయనాలుచేస్తే ఎంతో మేలు చేకూరుతుందని నిపుణుల అభిప్రాయంగా ఉంది. గల్లీ లీడరైనా, పెద్దనేత అయినా ఆ లోపాలు, లొసుగులు సరిదిద్దగలిగితే ఆ పనివల్ల కలిగే సత్ఫలితం పార్టీకెంతో దన్నుగా ఉంటుంది. కొన్ని చోట్ల సాక్షాత్తు పార్టీ నేతలే ధర్నాలకు దిగుతున్నారు. నిజమే వారి ఆవేదన వారిది. అందులో వాస్తం ఉందేమో! వారి దృక్పథానికి అర్థం ఉందేమో!... లాంటి ప్రశ్నలూ ఉద్భవించడం యాదృచ్ఛికమే.

టీడీపీ ఇటీవల నామినేటెడ్ ముచ్చట కొంత తీరింది. ఇంకా కొన్ని పదవులున్నా...ఆ సమయం కోసమే పార్టీ నేతలు ,కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. అలాగే వలసలూ చెప్పుకోదగినవే. పార్టీ బలోపేతానికి ఇది శుభ పరిణామమేనని భావించినా, ఆ వచ్చిన వారంతా చిత్తశుద్ధితో పనిచేస్తే, కృషిచేస్తే సగం పని పూర్తయినట్లే.

సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తెలుగుదేశానికి ప్రతి అడుగూ కీలకమే. ఎన్నో అపశృతులున్నా...దిద్దుబాటలూ వేయాలి. ప్రజా పాలనలో, గమనంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం కత్తిమీద సాములా మారిన తరుణాన పార్టీని కాపాడుకోవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదన్నది తెలిసిందే. ఏతావాతా పార్టీ బాగుంటేనే అధికారం చేతికొస్తుంది. పార్టీలో క్రమశిక్షణ, పార్టీ బలోపేతం వగైరా చర్యలు చేపడితేనే దీర్ఘ కాలంలో ఫలితాలు కచ్చితంగా ఉంటాయన్నది ఎరుకే. టీడీపీ...శోధన చేస్తున్న నిపుణుల అభిప్రాయమూ ఇదే. పార్టీ ప్రతిష్ఠ మరింత పెరగాలంటే పార్టీ అధినేతకు కసరత్తూ తప్పదు. కష్టమూ తప్పదు!!

సెల్: 9959021483

ఉగ్రస్థావరాలపై దాడి తర్వాతే పాక్‌కు సమాచారం: జైశంకర్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకనే పాకిస్థాన్‌కు సమాచారం అందించామని విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పుకొచ్చారు. అప్పటికే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో కూడా ప్రకటన విడుదలైందన్నారు. విదేశాంగశాఖకు చెందిన కాన్సులేటివ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. 'ఉగ్ర స్థావరాలపై దాడులు ముగిశాక... పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాం. అప్పటికే పీఐబీ తొలి ప్రకటన జారీ అయింది' అని జైశకంర్ ప్యానల్‌కు వెల్లడించారు. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్న వేళ... దేశం మొత్తం ఒక్క తాటిపై నడవాలని అభ్యర్థించారు. ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్‌కు చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం... వాస్తవాలు వక్రీకరించడమేనని ఆయన వ్యాఖ్యానించినట్లు సీఎన్ బీసీ-న్యూస్18 కథనం పేర్కొంది. పాక్‌కు సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామా బాద్‌కు ముందుగానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కోటా: పోటీ పరీక్షల శిక్షణకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా నీట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 18 ఏళ్ల విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. 2025లో ఇది 15వ ఘటన కాగా... ఈ నెలలోనే రెండో ఆత్మహత్య. పోలీసుల కథనం ప్రకారం... జమ్మూ కశ్మీర్‌కు చెందిన 18 ఏళ్ల విద్యార్థిని జీషాన్ నెల క్రితం కోటాకు వచ్చి... ప్రతాప్ చౌరాహా ప్రాంతంలో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ నీట్‌కు సిద్ధమవుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె తన కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడింది. తరవాత వారు తిరిగి ఎన్నిసార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో విద్యార్థి స్నేహితురాలికి కాల్ చేశారు. ఆమె జీషాన్ గది వద్దకు వెళ్లగా లోపలి నుంచి గడియ వేసి ఉండడంతో... ఇతరుల సాయంతో తలుపులు పగలగొట్టారు. అక్కడ ఆ విద్యార్థిని ఉరి వేసుకొని ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మరో నీట్ అభ్యర్థి మే 3న తన గదిలో ఆత్మహత్య చేసుకుంది.

పాక్‌కు గూఢచర్యం...

సీఆర్‌పీఎఫ్ జవాను అరెస్టు

న్యూఢిల్లీ: దేశానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాను ఒకరిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. నిందితుడిని మోతీరామ్ జాట్‌గా గుర్తించింది. మోతీరామ్ జాట్ 2023 నుంచి జాతీయ భద్రతకు సంబంధించిన క్లాసిఫైడ్ సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు (ఐఎస్ఐ) చేరవేస్తూ గూఢచర్యం చేస్తున్నట్లు ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. పీఐఓల నుంచి వివిధ మార్గాల ద్వారా అతను నిధులు అందుకుంటున్నట్టు గుర్తించామని పేర్కొంది. మోతీరామ్ జాట్‌ను దిల్లీలో అరెస్టు చేసి ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. దేశ రక్షణలో బలగాల పాత్ర కీలకమైనదని, దేశ భద్రతను పణంగా పెట్టి గూఢచర్యానికి పాల్పడటం తీవ్రంగా పరిగణించాల్సిన వ్యవహారమని కోర్టు స్పష్టంచేసింది. జూన్ 6 వరకూ నిందితుడిని ఎన్ఐఏ కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలోని అనుమానాస్పద గూఢచారులపై భారత్ కన్నేసింది. దీంతో ఒక్కక్కరు బయటపడుతున్నారు. పాక్ కోసం గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి 12 మందిని ఇప్పటికే అరెస్టు చేశారు.

రేవ్ పార్టీ... 30 మంది అరెస్టు

దొడ్డబళ్లాపురం (కర్నాటక): దేవనహళ్లి విమానాశ్రయం సమీపంలో కన్నమంగల వద్ద ఉన్న ఫాంహౌస్‌లో రేవ్ పార్టీపై దేవనహళ్లి పోలీసులు ఆదివారం దాడి చేసి 10 మంది యువతులు, 20 మంది యువకులను అరెస్టు చేశారు. వారంతా శనివారం ఉదయం నుంచే రేవ్ పార్టీలో మజా చేస్తున్నట్లు తెలిసి పోలీసులు సోదాలు జరిపారు. అందరినీ నిర్బంధించి తనిఖీలు చేపట్టారు. నిషేధిత మత్తు పదార్థాలు లభించినట్లు సమాచారం. వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విమానాశ్రయానికి అతి సమీపంలో ఉన్న ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ జరగడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో పాల్గొన్నవారు బడాబాబులని, అమ్మాయిలను పిలిపించి నృత్యాలు, మద్యం తదితరాలతో జల్సా చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పెద్దసంఖ్యలో కార్లు, బైకులు, మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గంగూలీ సోదరుడి కుటుంబానికి త్రుటిలో తప్పిన ప్రమాదం

పూరీ: మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ సోదరుడు స్నేహాశీష్ కుటుంబానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒడిశాలోని పూరీ తీరంలో వారు ప్రయాణిస్తున్న స్పీడ్‌బోటు అకస్మాత్తుగా తిరగబడింది. అప్రమత్తమైన లైఫ్ గార్డ్స్ వెంటనే రంగంలోకి దిగి వారిని రక్షించారు. స్నేహాశీష్, అతడి భార్య అర్పిత పూరీ బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బోటులో సరిపడా ప్రయాణికులు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అర్పిత నిర్వాహకులపై మండిపడ్డారు. 'సముద్రంలో అప్పటికే అలల తీవ్రత ఎక్కువగా ఉంది. సాధారణంగా ఒక్కో స్పీడ్‌బోటులో 10 మంది ప్రయాణికులు ఉండాలి. కానీ ఇక్కడ ఎక్కువ డబ్బులకు ఆశపడి కేవలం ముగ్గురు, నలుగురిని మాత్రమే ఎక్కించుకుంటున్నారు. బోటు తేలికగా ఉండటంతో భారీ అలకు తిరగబడింది' అని ఆమె తెలిపారు. లైఫ్ గార్డ్స్ లేకపోయి ఉంటే తాము ప్రాణాలతో ఉండేవాళ్లం కాదని అర్పిత ఆవేదన వ్యక్తం చేశారు. బోట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కాగా... సముద్రం నుంచి వీరిని రక్షిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

దారుణ హత్యాచారాలు

కర్నాటకలో బాలిక, మధ్యప్రదేశ్‌లో మహిళపై ఘాతుకం

బెంగళూరు/భోపాల్: దేశంలో బాలికలు, మహిళలపై వరుస హత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కర్నాటకలోని రామనగరలో మైనర్ బధిర-మూగ బాలికపై, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఖాండ్వాలో 45 ఏళ్ల ఇద్దరు పిల్లల తల్లికి సంబంధించి రెండు వేర్వేరు దారుణ హత్యాచార ఘటనలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. ముఖ్యంగా అణగారిన వర్గాల మహిళల భద్రతపై తీవ్ర నిరసనలు, ప్రశ్నలు తలెత్తాయి. మే 12న కర్నాటకలోని రామనగరలోని రైల్వే ట్రాక్‌ల సమీపంలో 14 ఏళ్ల ఖుషీ అనే గిరిజన బాలిక మృతదేహం లభించిందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. భద్రాపుర హక్కీ పిక్కీ కాలనీలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదృశ్యమైంది. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రంతా వెతికారు. కానీ బాలిక జాడ తెలియలేదు. మరుసటి రోజు ఉదయం ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో గ్రామంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఖుషీని కిడ్నాప్ చేసి, లైంగికంగా వేధించి, హత్య చేశారని గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నలుగురు నుంచి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. 'బాలిక తలపై గాయాల గుర్తులు ఉన్నాయి. ఇది చాలా అనుమానాస్పద హత్య కేసు' అని భద్రపుర గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అన్నారు. 'పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో మేము జోక్యం చేసుకోము. ప్రతీకారం, అక్రమ సంబంధం, అత్యాచారం లేదా మరేదైనా అయినా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనివ్వండి. న్యాయం జరిగేలా చూడటం మా విధి' అని ఆయన తెలిపారు. బాలిక కుటుంబానికి సామాజిక సంక్షేమ శాఖ నుంచి రూ.4,12,500, గ్రామ పంచాయతీ నుంచి రూ.50 వేల చెక్కులను పరిహారంగా అందజేశారు. కాగా, ప్రాథమిక దర్యాప్తులో మృతదేహంపై ఎటువంటి గాయాలు కనిపించలేదని రామనగర ఎస్పీ శ్రీనివాస్ గౌడ తెలిపారు. ఆ బాలిక బెంగళూరు అర్బన్ జిల్లాలోని ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. వేసవి సెలవుల కోసం తన స్వగ్రామానికి తిరిగి వచ్చింది. గ్రామంలో జరిగిన ఒక పుట్టిన రోజు వేడుకలో ఆమె కనిపించలేదని ఫిర్యాదు అందింది. బాలిక మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించే ముందు రాజరాజేశ్వరి వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. రామనగర ఎస్పీ ఆర్.శ్రీనివాస్ గౌడ, డివైఎస్పీ శ్రీనివాస్, బిడాడి పిఐ శంకర్ నాయక్ నేతృత్వంలో మూడు దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.

ఖాండ్వాలో గిరిజన మహిళపై హత్యాచారం

మధ్య ప్రదేశ్‌కు చెందిన ఖాండ్వా జిల్లా ఖల్వాలోని రోష్ని చౌకి ప్రాంతంలో మే 24న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పొరుగువారి ఇంట్లో ఒక గిరిజన మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. ఆ మహిళ మరణించిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హరి పాల్వి, సునీల్ ధుర్వే అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇద్దరూ ఆ మహిళకు పరిచయస్తులు, ఒకే గ్రామ నివాసితులు. వారు ఆమెపై సామూహిక అత్యాచారం చేసినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 'ఖండ్వా జిల్లా ఆసుపత్రిలో ఫోరెన్సిక్ నిపుణుల నిఘాలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. నివేదికలో మరిన్ని వివరాలు వెల్లడవుతాయి' అని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. 'నిందితుడు మహిళను హింసించి ఆమె ప్రైవేట్ భాగాలను దెబ్బ తీశాడు' అని డీఐజీ సిద్ధార్థ్ బహుగుణ అన్నారు. ఆ మహిళ శుక్రవారం రాత్రి ఒక వివాహంలో పాల్గొని... ఆ తర్వాత సమీపంలోని బంధువును దింపడానికి నిందితులలో ఒకరితో వెళ్లింది. తరువాత ఆమె హరి ఇంట్లో రక్తస్రావంతో తీవ్ర విషమ పరిస్థితిలో కనిపించింది. ఏఎస్పీ రఘువంశీ తెలిపిన వివరాల ప్రకారం... వారు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఆమెకు అధిక రక్తస్రావం అవుతున్నప్పటికీ ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. మధ్యాహ్నం 1:30-2 గంటల ప్రాంతంలో ఆమె మరణించింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం ఆసుపత్రికి తరలించారు. అయితే మహిళ పేగు బయటకు రావడంతో తీవ్రంగా గాయపడిందని, శరీరంపై లాగడం, గీతలు కూడా కనిపించాయని మరొక వార్తా సంస్థ కథనం పేర్కొంది. అదనపు ఎస్పీ రాజేష్ రఘువంశీ మాట్లాడుతూ 'ప్రాథమిక పోస్ట్‌మార్టం నివేదికలో ప్రైవేట్ భాగాలపై తీవ్రమైన అంతర్గత గాయం ఉన్నట్లు నిర్ధారించబడింది. దీని ఆధారంగా, కూలీగా పనిచేసే అదే గ్రామానికి చెందిన హరి పాల్వి (40), సునీల్ కోర్కు (30) పై సామూహిక అత్యాచారం, హత్య కేసు నమోదు చేశాము' అని తెలిపారు. ఇదిలాఉండగా, చనిపోయే ముందు, ఆ మహిళ కొద్దిసేపు స్పృహ తిరిగి వచ్చి ఇద్దరు నిందితుల పేర్లను ప్రస్తావించినట్లు బాధిత మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. 'నాకు ఏదో భయంకరమైన సంఘటన జరిగింది. నేను బ్రతకలేను. సునీల్, హరి ఇలా చేశారు' అని పేర్కొందన్నారు.

తయారీ రంగం పరుగులు పెడుతోంది

భారత్‌తో శత్రుత్వమే పాక్ ఏకైక లక్ష్యం: ప్రధాని మోదీ

అహ్మదాబాద్: దేశ తయారీ రంగం పరుగులు పెడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని సోమవారం గుజరాత్‌లోని దహోద్‌లో పర్యటించారు. సుమారు రూ.24 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వెరావల్-అహ్మదాబాద్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు, వల్సాద్-దాహోద్ మధ్య మరో ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. దీంతో పాటు, ఇక్కడే నెలకొల్పిన ఎలక్ట్రిక్ లోకోమోటివ్ తయారీ కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తూ... దేశ తయారీరంగం వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని గుర్తుచేస్తూ... "ఎన్నికల సమయంలో పునాది వేశారు కానీ నిర్మాణాలు చేపట్టరని అప్పట్లో కొందరు విమర్శించారు. కానీ ఈ రోజు ఇక్కడ తయారైన ఎలక్ట్రిక్ లోకోమోటివ్ మన కళ్లముందు కనిపిస్తోంది" అన్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా మార్చేందుకు 140 కోట్ల మంది ప్రజలు ఐక్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. "ఈ 11 ఏళ్లలో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నాం. దశాబ్దాల నాటి సంకెళ్లను బద్దలు కొట్టి, దేశాన్ని ఓ పెద్ద తయారీ కేంద్రంగా మారుస్తున్నాం. ఇప్పుడు కార్లు, ఫోన్లు, బొమ్మలు, ఆయుధాలను కూడా ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం" అని ప్రధాని మోదీ వివరించారు. 2014లో ఇదే రోజు తాను తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టానని మోదీ గుర్తుచేసుకున్నారు. తొలుత గుజరాత్ ప్రజలు తనను ఆశీర్వదించారని, ఆ తర్వాత కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు లభించాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రతీకారదాడులకు ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని తిప్పికొట్టినట్లు ప్రధాని తెలిపారు. దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్... భారత్‌తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. భారత్ లక్ష్యం పేదరికాన్ని నిర్మూలించటం. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం. అభివృద్ధి చెందటమని తెలిపారు. దేశ సైన్యం బలంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని... అప్పుడు మన ఆర్థికవ్యవస్థ బలంగా ఉంటుందని మోదీ అన్నారు. అంతకు ముందు పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రోడ్‌షో నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి రెండురోజుల గుజరాత్ పర్యటనకు వచ్చిన ప్రధానికి ఘనస్వాగతం లభించింది. వడోదర విమానాశ్రయం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న వైమానిక కేంద్రం వరకు రోడ్ షో నిర్వహించారు. అంతర్జాతీయ విద్యార్థులతోపాటు ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన కర్నల్ సోఫియా ఖురేషి తల్లిదండ్రులు, సోదరుడు మహ్మద్ సంజయ్ ఖురేషి, సోదరి స్యానా సున్‌సారా పాల్గొన్నారు.

కొల్లాం తీరంలో 8 లిబేరియా నౌక కంటైనర్లు

తిరువనంతపురం: కొచ్చి తీరంలో మునిగిన లిబేరియాకు చెందిన ఎంఎస్సీ ఎల్సా -3 కార్గో నౌకలోని సుమారు ఎనిమిది కంటైనర్లు సోమవారం కొల్లం తీరంలో కనిపించాయి. ఆ ప్రాంతాన్ని పోలీసులు సీజ్ చేశారు. సముద్ర తీరం వద్ద ఉన్న భారీ రాళ్ల గోడను ఢీకొట్టాయి. కంటైనర్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. సమీపంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అలప్పుజా, కొల్లామ్, తిరువనంతపురం జిల్లాల తీరాలకు 80 శాతం కంటైనర్లు చేరే అవకాశం ఉన్నట్లు ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ అంచనా వేశాయి. 96 గంటల్లోగా ఆ కంటైనర్లు తీరానికి చేరుతాయని భావిస్తున్నారు. 640 కంటైనర్లతో ఉన్న కార్గో నౌక నీట మునిగింది. కొచ్చి నౌకాశ్రయం వద్ద ఈ ఘటన జరిగింది. విజిన్‌జమ్ నుంచి కొచ్చి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అలప్పుజాలోని తోటపల్లి స్పిల్‌వేకు 27 కిలోమీటర్ల దూరంలో మునిగింది. ప్రమాదకర రసాయనాలు, కాల్షియం కార్బైడ్, ఫ్యూయల్ లీక్ జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆ నౌకలో ఉన్న జార్జియా ఇంజినీర్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. వాతవరణం సరిగాలేకపోవడం, సాంకేతిక లోపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

- గవర్నర్ భల్లా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ప్రదర్శనకారులపై బాష్పవాయు గోళాలు

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. గవర్నర్ అజయ్ కుమార్ భల్లా మణిపూర్‌కు తిరిగి రావడానికి ముందు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో జర్నలిస్టులతో ఉన్న ప్రభుత్వ బస్సుపై రాష్ట్రం పేరును తొలగించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు, మహిళలు ర్యాలీ చేపట్టకుండా భద్రతా దళాలు సోమవారం అడ్డుకున్నాయి. వారిని చెదరగొట్టడానికి బాష్ప వాయుగోళాలను ప్రయోగించాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది నిరసనకారులు గాయపడ్డారు. తిడ్డిమ్ రోడ్ లోని క్వాకీథెల్ ప్రాంతంలో నిరసనకారులు గుమిగూడి రాజ్ భవన్ వైపు మూడు కిలోమీటర్ల దూరం ప్రదర్శన చేయాలని భావించారు. కానీ వారిని అక్కడి నుంచి ముందుకు సాగకుండా నిలువరించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఇంఫాల్ విమానాశ్రయం నుంచి కైసంపత్ వరకు ఆరు కిలోమీటర్ల మేర రాజ్ భవన్ కు 200 మీటర్ల దూరంలో మానవహారం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. 'మణిపూర్ గుర్తింపుపై చర్చనీయాంశం లేదు', 'మణిపూర్ ప్రజలకు గవర్నర్ క్షమాపణ చెప్పాలి' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శనకారులు పట్టుకున్నారు. ఇంఫాల్ విమానాశ్రయం నుంచి రాజ్ భవన్ వరకు టిడ్డిమ్ రోడ్డు వెంబడి అస్సాం రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో సహా పెద్ద సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు. గవర్నర్ భల్లా సోమవారం దిల్లీ నుంచి ఇంఫాల్‌కు చేరుకుంటారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని మోయిరాంగ్‌ఖోమ్, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కొసుంగ్ మామాంగ్‌తో సహా అనేక ప్రదేశాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. విష్ణుపూర్ జిల్లాలోని నింగ్‌థౌఖోంగ్, మోయిరాంగ్ ప్రాంతాలలో మానవహారం నిర్వహించారు. మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ ప్రారంభించిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు ఈ నిరసనలు కొనసాగింపు. మే 20న ఉఖ్రుల్ జిల్లాలోని శిరుయ్ లిల్లీ ఉత్సవానికి వెళుతున్న జర్నలిస్టులతో కూడిన ప్రభుత్వ బస్సు నుంచి రాష్ట్రం పేరును తొలగించడాన్ని నిరసిస్తూ మైతేయి గ్రూపు గత వారం మణిపూర్ అంతటా 48 గంటల సమ్మెను నిర్వహించింది. ఈ సంఘటన గ్వాల్టాబి ప్రాంతంలో జరిగింది. గవర్నర్ క్షమాపణ చెప్పాలని, ముగ్గురు ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం దాని కన్వీనర్ ఖురైజామ్ అథౌబా నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం దిల్లీకి బయలుదేరి మంగళవారం హోం మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమవుతుంది. ఈ సందర్భంగా అథౌబా విలేకరులతో మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్ కారణంగా కేంద్రం నుంచి మా లక్ష్యాలను సాధించడంలో ఆలస్యం చేశాము. దేశంలోని పశ్చిమ భాగంలో ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన తరువాత, దేశం తూర్పు భాగంలో నార్కో-టెర్రరిస్టులను ఎదుర్కోవడంలో కేంద్రం చర్యలను కోరుతున్నాము' అని అన్నారు. 'ఒక క్లిష్టమైన సమయంలో గ్వాల్టాబి సంఘటన జరిగింది. రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని అవమానించారు. గ్వాల్టాబి సంఘటన, మణిపూర్ సంక్షోభానికి సంబంధించిన ఇతర అజెండాకు సంబంధించిన అంశాలను మేము లేవనెత్తుతాము' అని అన్నారు.

యూట్యూబర్ జ్యోతికి పాక్‌లో ఏకే 47తో భద్రత

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై దర్యాప్తు కొనసాగుతోంది. ఓ స్కాటిష్ యూట్యూబర్ తీసిన వీడియోలో జ్యోతి మల్హోత్రాకు సంబంధిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె పాకిస్థాన్‌లో పర్యటించిన సమయంలో స్కాటిష్ యూట్యూబర్ క్యాలమ్ మిల్ సైతం తన పర్యటనలో భాగంగా కొన్ని వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. వాటిలోని ఓ వీడియోలో లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో జ్యోతి వీడియోలు తీస్తూ క్యాలమ్ మిల్‌కు ఎదురుపడ్డారు. అతడు జ్యోతిని పలకరిస్తూ... తాను స్కాటిష్ యూట్యూబర్‌గా పరిచయం చేసుకున్నాడు. తాను భారత్ నుంచి వచ్చానని జ్యోతి సమాధానం చెప్పింది. 'మీరు మొదటిసారి పాక్‌కు వచ్చారా' అని అతడిని ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఐదుసార్లు వచ్చినట్లు అతడు చెప్పాడు. పాకిస్థాన్ ఆతిథ్యం గురించి మిల్ ఆమె అభిప్రాయాన్ని అడగగా... చాలా బాగుందని సమాధానం ఇచ్చింది. అనంతరం అమె వెళ్తుండగా ఆరుగురు వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఏకే 47 తుపాకీలతో జ్యోతికి భద్రత కల్పిస్తున్నట్లు గుర్తించిన మిల్ వారి ఆయుధాలు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారు ధరించిన జాకెట్లపై 'నో ఫియర్' అని రాసి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఆమెకు అన్ని తుపాకులతో భద్రత కల్పించాల్సిన అవసరం ఏముందని అతడు తన అభిమానులను ఉద్దేశించి ప్రశ్నించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో ఆమె చుట్టూ మరికొంతమంది పర్యాటకులు ఉండడంతో సాయుధులు ఆమెకు మాత్రమే భద్రత కల్పించారా లేదా ఆమెతో ఉన్న బృందం మొత్తానికీ భద్రత కల్పించారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గూఢచర్యం కేసుకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తులో పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు జ్యోతి మల్హోత్రా అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

పోలీసులకు లంచం... ఖైదీల ఏ'కాంత'వాసం

జైపూర్: జైల్లో ఉండాల్సిన ఖైదీలు నగరమంతా తిరిగి... తమ భార్యలు, ప్రియురాళ్లతో హోటళ్లలో గడుపుతూ జల్సా చేసిన ఘటన జైపూర్‌లో వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం జైపూర్ జైలు నుంచి శనివారం బయటకు వెళ్లిన ఖైదీలు సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో జైలు అధికారులు విచారణ చేపట్టగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జైపూర్ కేంద్ర కారాగారం నుంచి శనివారం రఫీక్ బక్రి, భన్వర్ లాల్, అంకిత్ బన్సాల్, కరణ్ గుప్తా అనే నలుగురు ఖైదీలను కానిస్టేబుళ్లు వైద్య పరీక్షల కోసం బయటకు తీసుకువెళ్లారు. ఇదే అదనుగా భావించిన ఖైదీలు గార్డులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు లంచం ఇస్తామని, తమను సాయంత్రం వరకు బయట వదిలేయాల్సిందిగా కోరారు. దీనికి అంగీకరించిన కానిస్టేబుళ్లు వారిని వదిలివేశారు. బయటకు వెళ్లిన ఖైదీలు సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో అధికారులు వారికోసం గాలిస్తుండగా ఓ హోటల్‌లో రఫీక్ తన భార్యతో, భన్వర్ తన మాజీ ప్రియురాలితో ఉన్నట్లు గుర్తించి... అదుపులోకి తీసుకున్నారు. రఫీక్ భార్య వద్ద మాదకద్రవ్యాలు ఉండడంతో ఆమెపై కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు ఖైదీలు అంకిత్, కరణ్ విమానాశ్రయానికి సమీపంలోని ఒక హోటల్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరణ్‌తో పాటు ఉన్న అతడి బంధువు వద్ద అనేక మంది ఖైదీల ఐడీ కార్డులు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జైల్లో ఉన్న ఓ దోపిడీ దొంగ వీరు బయటకు పారిపోవడానికి పథకం వేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అంతేకాకుండా జైల్లో కానిస్టేబుళ్లకు లంచాలు ఇస్తూ... ఖైదీలు దొంగతనంగా ఫోన్లు వాడుతున్నారని, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సహా పలువురు వీఐపీలకు ఇక్కడి నుంచి కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు గుర్తించామని అన్నారు. ఈ కేసులో ఐదుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఖైదీలు, వారి బంధువులు సహా మొత్తం 13 మందిని అరెస్ట్ చేసినట్లు సోమవారం మీడియాకు వెల్లడించారు.

ఉగ్రవాదుల కేంద్రం పాక్: ఆజాద్

న్యూఢిల్లీ: ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం కక్కుతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు వివిధ పార్టీల ఎంపీల నాయకత్వంలోని బృందాలు ప్రపంచదేశాలకు వెళ్లాయి. బీజేపీ నేత బైజయంత్ పాండా నేతృత్వంలోని బృందం బహ్రెయిన్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా బృంద సభ్యుల్లో ఒకరైన జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తంతో పోల్చితే పాకిస్థాన్‌లోనే అత్యధిక సంఖ్యలో ఉగ్రవాదులున్నారని విమర్శించారు. బహ్రెయిన్ వివిధ మతాల సమ్మేళనమని, ప్రజల్లో ఎటువంటి విభేదాలు లేవని అన్నారు. ఇది ఓ మినీ ఇండియాలా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అఖిలపక్ష బృందంలో ఉన్న తామంతా వేర్వేరు పార్టీలకు చెందినవారిమైనా... ఐక్యంగా ప్రపంచ దేశాల ముందుకు వచ్చామన్నారు. పాక్ మతపరమైన భావజాలంతో ఏర్పడిన దేశమని, అయినా అక్కడి వారిలో ఐక్యత లోపించిందని విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ సహా ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు కొనసాగించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. పాక్ అధినేతలతో శాంతి చర్చలు జరపడానికి అనేకసార్లు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై అక్కడి నేతలకు వివరిస్తూ... ఆపరేషన్ సిందూర్‌లో భారత్ కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిందని, సాధరణ ప్రజలకు, సైనికులకు ఎటువంటి నష్టం కలిగించలేదన్నారు. అయినప్పటికీ పాక్... భారత సరిహద్దు ప్రాంత పౌరులపై దాడులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్జి నోట్ల కట్టల వ్యవహారం

నివేదిక బహిర్గతం చేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ: దిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో సోమవారం కీలక మలుపు చోటుచేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ వర్మ దిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా... మంటలార్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. దీనిపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదిక అందజేసింది. అయితే... అందులో విషయాను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ... ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఈ) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. 2019 నాటి సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది. మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని సమయంలో బంగ్లాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో... బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు. మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా... ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ముగిసిన సరస్వతి పుష్కరాలు : మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సరస్వతి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఛాలెంజ్‌గా తీసుకుని నిర్వహించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ పుష్కరాలు విజయవంతంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అయన అభినందించారు. సోమవారం సాయంత్రం సరస్వతి ఘాట్ వద్ద రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 12 రోజుల నుండి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాత్రదారులయ్యారని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. భగవంతుడు పుష్కరాలను నిర్వహించే అవకాశం కల్పించాడని రూ.40 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుష్కరాలకు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 15 నుండి 26 వరకు జరిగిన పుష్కరాలకు ఈ ప్రాంత ప్రజలు ఆశీస్సులు అందించారని అభినందించారు. ఎన్నికల నిబంధనలు వల్ల పనులు చేపట్టేందుకు కొద్దిగా ఇబ్బంది కలిగినా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం తక్కువ సమయంలో ముఖ్యమంత్రి ఆలోచన మేరకు చేసిన పుష్కరాలు దిగ్విజయం అయ్యాయని తెలిపారు. వర్షం వల్ల అంతరాయం ఏర్పడినా భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశారని అన్నారు. గోదావరి, ప్రాణహిత, అంతరవాహిని సరస్వతి సంగమంలో మొట్ట మొదటిసారిగా పుష్కరాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సరస్వతి మాతా 17 అడుగులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దాదాపు 30 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని, ఈ ప్రాంతానికి అన్ని లక్షల మంది ఎన్నడూ రాలేదని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, అన్నదానం చేసారని అభినందించారు. రాబోవు గోదావరి పుష్కరాలను మరింత వైభవంగా జరుపుతామని అన్నారు. కాశీ పండితులు, ప్రతి రోజు సరస్వతి నవరత్న మాలా కార్యక్రమం నిర్వహించారని తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 76 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకై సంతకాల సేకరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ఆధ్వర్యంలో "రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణకై చట్టాన్ని అమలు చేయాలని సంతకాల సేకరణ చేయడం జరిగింది. తెలంగాణలో సుమారు 60 శాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. వీరిలో మెజారిటీ అల్పాదాయ వర్గాలకు చెందిన కుటుంబాల వారే ప్రైవేటు పాఠశాలలు ప్రతి సంవత్సరం ఫీజులు విచ్చలవిడిగా పెంచుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఎటువంటి సామాగ్రిని అమ్మకూడదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ పాఠశాలలో యూనిఫాములు, పుస్తకాలు, డిజిటల్ లర్నింగ్ సామాగ్రి తమ పాఠశాల బ్రాండ్ ద్వారా అమ్ముతూ విద్యార్థుల కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం హామీ ఇవ్వబడిన విద్యాహక్కు చట్టాన్ని ముల్లంగించడమే, రాష్ట్రంలో ఫీజు నియంత్రణ కమిటీ ఉన్నప్పటికీ దానికి చట్టపరమైన అధికారాలు, అమలు వ్యవస్థలు లేకపోవడం వలన నిరుపయోగంగా ఉంది. బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి నారాయణ, తల్లుల సంఘం మండల కన్వీనర్ రాధ, లావన్య, రమాదేవి, టిడిపి నాయకులు కారణం గోపి, వగ్గు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా లక్ష్మి

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీపీఐ జిల్లా 4వ మహాసభలు సోమవారం ఉదయం ఈసిఐఎల్, బంజార ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా జె. లక్ష్మి ఎన్నిక 4వ సారి ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, సాయిలు గౌడ్, వీఎస్ బోస్, ఉమా మహేష్ లకు కృతజ్ఞతలు తెలియజేసారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తానని, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తానని, మేడిపల్లి భగత్ సింగ్ నగర్ కాలనీలో నివసిస్తున్న అందరికి పట్టాలు ఇప్పించేవిధంగా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని జె. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద భీమా

దేశ చరిత్రలోనే ఒక రికార్డు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం ప్రజాభవన్‌లో ఎన్‌పిడిసిఎల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కుతో పాటు విద్యుత్ శాఖలో నరేష్ భార్యకు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యం అయ్యింది అన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు, మానవీయ కోణానికి అద్దం పడుతుంది అన్నారు.

కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు.

ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్‌పిడిసిఎల్ సీఎండి వరుణ్‌రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - ఆమనగల్లు : తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో 200 వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భూమి పూజ, 12 కోట్లతో నిర్మించే సబ్ స్టేషన్ నిర్మాణం పనులకు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు ఆమనగల్లు లో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రికి ఎదురేగి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో గల ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ నిర్మాణం పనులను పూర్తి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రిని కేశవులు కోరారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు తెలగమల జగన్, కృష్ణ నాయక్, శ్రీను నాయక్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

భూ భారతిలో సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్స్ ట్రైనింగ్‌సెంటర్‌ను జిల్లా కలెక్టర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని శిక్షణ కేంద్రంలో 50 రోజుల పాటు ఇచ్చే లైసెన్సుడ్ సర్వే ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమమును జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతిలో నిరుద్యోగ లైసెన్సుడ్ సర్వే శిక్షణ పొందేందుకు ఐటిఐ, సివిల్ ఇంజనీరింగ్ చేసిన నిరుద్యోగులైన హైదరాబాద్ జిల్లాకు చెందిన 76 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని వీరందరికీ అనుభవజ్ఞులైన వారిచే సర్వే శిక్షణను 50 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఈ లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు, భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు హక్కులపై తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మానవ జీవితంలో పుట్టినప్పటి నుండి మొదలుకుని మనిషి చనిపోయే వరకు కూడా "భూమి" అవసరము ఉంటుందని, ప్రతి ఒక్కరికి ఇది అవసరమని తెలిపారు. నిత్య జీవితంలో ఎన్ని మార్పులు, సాంకేతిక మార్పులు, కంప్యూటర్స్, ఇతర సాఫ్ట్ వేర్ టెక్నాలజీలు రోజు రోజుకు కొత్తగా వస్తున్నాయని, టెక్నాలజీ పెరుగుతున్న దని, ఎన్ని మార్పులు జరిగినా కూడా ఈ భూముల విషయంలో మాత్రం సహజంగానే అలాగే ఉన్నామని, రైతులు ఈ భూముల వ్యవసాయం చేస్తేనే మనమంతా సుఖ సంతోషములతో బ్రతుకుచున్నామని, అందుకే ఈ భూములను ఎప్పటికప్పుడు పర్యవీక్షిస్తూ, ఎలాంటి గెట్టు తగాదాలు లేకుండా ఉండేందుకు గాను, హద్దులను కాపాడేందుకు గాను, సర్వేయర్‌ల కొరత తీరెందుకై రాష్ట్ర ప్రభుత్వము "భూ భారతి" స్కీం ప్రారంభించిందని తెలిపారు. అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డి, జిల్లా సర్వే అధికారి వి. శ్రీరామ్, ఇన్స్పెక్టర్ అనంతరెడ్డి పాల్గొన్నారు.

18 మంది దివ్యాంగులకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేత

అర్హులైన దివ్యాంగ అభ్యర్థులను పారదర్శకంగా ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ చేపట్టి నియామక పత్రాలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దివ్యాంగులకు కేటాయించిన కొన్ని పోస్టులు బ్యాక్లాగ్ 37 పోస్టులకు గాను అర్హత మేరకు పారదర్శకంగా 18 మందికి వివిధ కేటగిరీలలో ఉద్యోగ నియామక పత్రాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఇట్టి ఉద్యోగాలకు గాను 2018- 19 లో నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగినదని, తదుపరి వివిధ కారణాలతో నియామక ప్రక్రియ పూర్తికాలేదని కలెక్టర్ తెలిపారు. 37 ఉద్యోగాలకు గాను 18 మాత్రమే ప్రస్తుతం ఖాళీలుగా గుర్తించడం జరిగినదని ఈ 18 పోస్టులకు అర్హులైన వివిధ వర్గాల దివ్యాంగ అభ్యర్థులను గుర్తించి వారి అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఉద్యోగాలు సాధించిన దివ్యాంగులు జీవితంలో స్థిరపడాలని, దివ్యాంగులు ఉద్యోగం సాధించడం అనేది ఒక గొప్ప అంశమని నూతన ఉద్యోగం పొందిన 18 మంది దివ్యాంగులు జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించి అభ్యర్థులను సందర్భంగా అభినందించారు. ఈ నియామక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించిన డిఆర్ఓ ఈ. వెంకటాచారి, జిల్లా సహాయ సంచాలకులు రాజేందర్, జహురుద్దీన్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీలోఫర్ ఆస్పత్రి ఇన్చార్జి పర్యవేక్షకులుగా డాక్టర్ విజయకుమార్

నీలోఫర్ ఆస్పత్రి ఇన్చార్జి పర్యవేక్షకులుగా డాక్టర్ విజయకుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలసి పూల బోకే అందచేశారు.

ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై విన్నపాలను అడిషనల్ కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగం అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలు వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 33, ఇంజనీరింగ్ 4, ట్యాక్స్ సెక్షన్ 3, ల్యాండ్ అక్విజిషన్, హెల్త్, యు.సి.డి, యు.బి.డి విభాగాలకు రెండు చొప్పున, ఎలక్ట్రికల్, పి.ఓ.ఎల్.డబ్ల్యు ఎస్, అడ్మిన్, కూకట్‌పల్లి జోన్, శానిటేషన్, ఖైరతాబాద్ జోన్, ఎలక్షన్, ఎల్బీనగర్ జోన్, డి.సి 18, డి.సి 17 లకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 104 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 40, సికింద్రాబాద్ జోన్‌లో 27, శేరిలింగంపల్లి జోన్‌లో 18, ఎల్బీనగర్ జోన్‌లో 12, చార్మినార్ జోన్‌లో 7 ఆర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ అధికారులకు ఆదేశించారు. అడిషనల్ కమిషనర్‌లు యాదగిరిరావు, అశోక్ సామ్రాట్, వేణు గోపాల్, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సిసిపిలు గంగాధర్, వెంకన్న, ఎల్ఏఓ రామునాయక్, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, డిప్యూటీ సిఈలు పనస రెడ్డి, పివి రావు, హౌసింగ్ ఈఈ రాజేశ్వరరావు, జాయింట్ కమీషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, ఏఎంసి జీవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల శిక్షణా శిబిరాలపై భారత వైమానిక దాడులును ప్రశంసిస్తున్నాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పీఓకే, పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల శిక్షణా శిబిరాలపై భారత వైమానిక దాడులు ప్రశంసిస్తున్నామని ఇండియన్ నేషనలిస్ట్ మూవ్మెంట్ జాతీయ అధ్యక్షులు మోటూరి కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. పహెల్‌గామ్‌లో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను హత్యలు ఖండిస్తున్నామన్నారు. పౌరులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఉగ్రవాదుల శిక్షణా శిబిరాలపైనే వైమానిక దాడులు జరిపామని, సరిహద్దు నుండి నిరంతర దాడుల మధ్య పాకిస్తాన్ భూభాగంలోకి అడుగుపెట్టకుండా భారత సైన్యం ఖచ్చితమైన దాడి చేయడం అభినందనీయమన్నారు. భారత రక్షణ వ్యవస్థ పూర్తి స్థాయి శిక్షణతో క్రమశిక్షణ కలిగిన భద్రత దళాలు కలిగివుందని అయన తెలిపారు. క్రమశిక్షణే కాకుండా ఓర్పుతో కూడిన బలమైన రక్షణ వ్యవస్థని నిరూపించిందన్నారు. ప్రపంచ శాంతి తోపాటు పొరుగు దేశాలలో కూడా శాంతి నెలకొనాలని మన దేశం కోరుకోవడం సంతోషించదగినదని అయన అన్నారు.

రాజకీయ పదవుల కోసం సీఎం క్విడ్‌ప్రోక్వో ఒప్పందాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో పేరు రావడంతో, ఆయన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్ ఓ బహిరంగ లేఖ ద్వారా డిమాండ్ చేశారు. ఈడీ చార్జిషీట్ ప్రకారం, రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా సంస్థకు విరాళాల పేరుతో కోట్లాది రూపాయలు సేకరించి, రాజకీయ పదవుల కోసం క్విడ్‌ప్రోక్వో ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలు అవినీతిని నిరోధించే చట్టం, 1988 కింద వస్తాయని, ఇది కేవలం చట్టపరమైన అంశం మాత్రమే కాకుండా, రాజ్యాంగ నైతికతను కూడా ఉల్లంఘిస్తుందని డా. శ్రవణ్ పేర్కొన్నారు. "మీరు కేవలం పార్టీ నేత మాత్రమే కాకుండా, రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారని, ఈ స్థాయిలో ఉన్న వ్యక్తిగా, మీపై వచ్చిన ఆరోపణలు ప్రభుత్వంపై నెగెటివ్ ప్రభావం చూపుతాయన్నారు. ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని కాపాడేందుకు మీరు రాజీనామా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరిస్తూ ప్రత్యేకంగా ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1994) కేసును, ఇందులో రాజ్యాంగ పదవులు కలిగిన వ్యక్తులు రాజ్యాంగ నైతికతకు అనుగుణంగా ప్రవర్తించాలనే అంశాన్ని ఎత్తిచూపారు. ఇతర రాజకీయ నాయకులు కూడా, అలాంటి పరిస్థితుల్లో రాజీనామా చేసిన ఉదాహరణలు ఉన్నాయని అయన వివరించారు. ఉదాహరణకు, ఎల్.కె. అద్వానీ (1996), లాలూ ప్రసాద్ యాదవ్ (1997), నత్వర్ సింగ్ (2005), శశి థరూర్ (2010), ఏ. రాజా (2010), అశోక్ చవాన్ (2010), దయానిధి మారన్ (2011), సురేష్ కల్మాడి (2011), బి.ఎస్. యడియూరప్ప (2011), అజిత్ పవార్ (2012), విరభద్ర సింగ్ (2012), అశ్వని కుమార్ (2013), పవన్ బన్సాల్ (2013), సురేష్ జైన్ (2013), లక్ష్మికాంత్ శర్మ (2014), రమేష్ జార్కిహోలీ (2021), కె.ఎస్. ఈశ్వరప్ప (2022), అరవింద్ కేజ్రీవాల్ (2024) వంటి నాయకులు, ఆరోపణలు వచ్చిన వెంటనే రాజీనామా చేశారని గుర్తు చేశారు. గవర్నర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని, కానీ, మీరు స్వయంగా రాజీనామా చేసి, న్యాయ ప్రక్రియకు సహకరించాలని సూచించారు.

కవిత లేఖతో ఒరిగేదేమి లేదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వ్రాసిన లేఖతో ఒరిగేదేమి లేదని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీ.రవీంద్రనాయక్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం మీ తండ్రి కేసీఆర్ అవినీతి చేస్తుంటే అప్పుడు కవితకు పూలే, సామాజిక న్యాయం గుర్తుకు రాలేదా అని నిలదీశారు. సోమవారం అయన విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ పచ్చి మోసగాడని, లేఖ కవిత రాసిందో కేసీఆరే కవితతో లేఖ రాయించాడో డౌట్ వస్తుందంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాపాలు ఒక్కొక్కోటిగా బయటకు వస్తున్నాయని వాటిని కప్పి పుచ్చుకోవడానికి కవితతో కావాలనే కేసీఆర్ ఈ లేఖ రాయించొచ్చని అభిప్రాయపడ్డారు. ఆయన గురించి నాకు బాగా తెలుసని, నాలాంటి ఎంతో మంది తెలంగాణ ఉద్యమకారులను అనగదొక్కిన నీచుడు కేసీఆర్ అంటూ మండిపడ్డారు. కేసీఆర్ ఓ పాపాల భైరవుడు, ఆయన గోబెల్స్ ప్రచారంలో దిట్ట అని తెలిపారు. మోడీ తెలంగాణకు వచ్చినప్పుడల్లా కేసీఆర్ అవినీతి పరుడు జైల్‌కు పోవడం ఖాయం అంటాడు కాని ఇప్పటి వరకు ఆయన మీద చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. మోడీ చర్యలు తీసుకోక పోయిన ప్రకృతి మాత్రం కేసీఆర్ మీద చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అందుకే వాళ్ళ కుటుంబంలో చిచ్చు మొదలైందని, ప్రాణ త్యాగం, పదవి త్యాగం చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ నాశనం చేశాడని విమర్శించారు. ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని సోనియా గాంధీ చలించి తెలంగాణను ఇచ్చిందని, ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా పాలనను అందిస్తుండన్నారు. రేవంత్ రెడ్డిని చూసి ఓర్వలేక కేసీఆర్, కేటిఆర్ విమర్శలు చేస్తున్నరని, ఫోన్ ట్యాపింగ్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం కుంభకోణాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను, నిజాం భూములను అన్ని తన దోచుకొని కేసీఆర్ క్విడ్ ప్రోకోకు పాల్పడిండని అన్నారు.

చార్మినార్ అందాలకు ముగ్ధులైన ఆఫ్రికన్ డెలిగేట్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ కు చిహ్నంగా నిలిచే చార్మినార్ అందాలకు ఆఫ్రికన్ డెలిగేట్ లు ముగ్ధులయ్యారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పర్యటనలో భాగంగా ఆఫ్రికా ఖండంలో మధ్య, పశ్చిమ ఆఫ్రికన్ దేశాల కంటెంట్ క్రియేటర్‌లు ఆదివారం హైదరాబాద్‌కు వచ్చారు. పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, గోల్కొండ కోటలను సందర్శించారు. వీరికి ప్రొఫెసర్ సాయి గైడ్‌గా వ్యవహరించగా చార్మినార్‌లోకి వెళ్లి వారు గంటకు పైగా ఉన్నారు. మొదటి అంతస్తు నుండి చార్మినార్, నగర అందాలను వీక్షించడంతోపాటు నిర్మాణ నేపథ్యం తదితర అంశాలను తెలుసుకొని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ కెమెరాల్లో చార్మినార్ అందాలను నిక్షిప్తం చేశారు. అనంతరం సాలార్ జంగ్ మ్యూజియంను సందర్శించారు. సాలార్జంగ్ తరాలకు చెందిన వస్తువులు, సేకరణలైన ఫర్నిచర్, శిల్పాలు, చిత్రలేఖనాలు, లిఖితప్రతులు, పింగాణి వస్తువులు, వస్త్రాలు, గడియారాలు, ఏనుగు దంతాల కళాకృతులు లోహపు వస్తువులతో పాటు మ్యూజియంలో భారతీయ కళలు, యూరోపియన్ పెయింటింగ్స్, మిడిల్ ఈస్టర్న్ పురాతన వస్తువులు, ఓరియంటల్ కళాఖండాలు వంటి వస్తువులను ఆసక్తిగా తిలకించారు. చిరుజల్లులు కురుస్తున్న గంటన్నరకు పైగా గోల్కొండ కోట అందాలను వీక్షించారు. యోవానీ నాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్‌గా దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా అమె కూడా హైదరాబాద్ వచ్చారు. పేరులోనే కాదు... ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం, భారతీయత ఉట్టిపడుతుంది. యువతి తండ్రి తెలుగు వ్యక్తి కాగా తల్లి తమిళనాడు. వారి పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికా వలస వెళ్ళారు. తాను ఆరో తరానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. తెలుగు, తమిళనాడు భాషలు రాకున్నా సంస్కృతి, సంప్రదాలయకు దూరం కాలేదు. కట్టు బొట్టు, సంప్రదాయ దుస్తుల్లో ఉంటూ.... స్థానిక భారతీయరాలు లాగే కనిపిస్తుంది. వెస్టర్న్, ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజ్‌ను ప్రమోటింగ్ చేస్తుంది. భౌతికంగా భారత్‌కు దూరమైన మానసికంగా ఎప్పటికీ దగ్గరగానే ఉన్నామని చెబుతుంది. తల్లిదండ్రుల ప్రోత్సహంతో 5 సంవత్సరాల నుంచే తనకు సంగీతంపై మక్కువ కలిగిందన్నారు. శ్రేయా ఘోషల్, చిత్ర, అనిరుధ్, రహమాన్‌లు తనకు ఇష్టమన్నారు.

నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లతో శాంతి చర్చలు నిర్వహించి వారి సమస్యను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జన సేవాదళ్ శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జన సేవాదళ్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సిస్ ఫైర్ తక్షణమే ఆపేసి నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. వారి సమస్యను ఒక సైద్ధాంతిక రాజకీయ సమస్యగా చూడలే కానీ తీవ్రవాద సమస్యగా పరిగణించకూడదని ఆయన హితవు పలికారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జనసేవ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, గోశిక మోహన్, మారుపాక అనిల్ కుమార్, శంకర్, ఏఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే.రామస్వామి, సిపిఐ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, చందు యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ గౌడ్, బి.సుభాన్ రెడ్డి, బికేఎంయు జిల్లా అధ్యక్షులు జే.అంజయ్య, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బిటిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నరసింహారెడ్డి, నాలుగు మండలాల కార్యదర్శులు ఎం.సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, ఎస్ ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి, కృష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అసలైన ఐఎన్‌టియుసి మాదే

విశాలాంధ్ర-బషీర్ బాగ్: అసలైన ఐ.ఎన్.టి.యు.సి మాదే అని, కార్మికవర్గ ప్రయోజనాలను విస్మరిస్తూ భౌతిక దాడులు చేస్తూ యూనియన్‌పై పెత్తనం చేసేందుకు ఎవరు ప్రయత్నం చేసినా సహించేదిలేదనీ, ఐ.ఎన్.టి.యు.సి (ఆర్)లో పనిచేస్తున్న నాయకులపైన ఇప్పటివరకు అవినీతి ఆరోపణలు లేదని, కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) ని బలమైన శక్తిగా తయారు చేస్తాం అని ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణ మూర్తి ప్రకటించారు. ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) నేతలపై భౌతికదాడులకు పాల్పడడమే కాకుండా ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామిను విమర్శించిన కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ ముఠాకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) తెలంగాణ రాష్ట్ర మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్య, జాతీయ కార్యదర్శి బి.అమర్ బాబు, జాతీయ ఉపాధ్యక్షులు సత్యదేవ్, మనోజ్ భట్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల లక్ష్మణ్, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు గొల్లపల్లి దయానంద్, రాష్ట్ర నాయకులు నడిమిటి నాగరాజు, చాంద్ పాషా, క్రిష్ణగౌడ్, ఆనంద్, జ్యోతి, జేమ్స్ ప్రసంగించారు. సభలో అంబటి కృష్ణ మూర్తి ప్రసంగిస్తూ మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య, కాంగ్రెస్ అగ్రనేత జి.వెంకట్ స్వామి, మాజీ మంత్రి పి.జనార్ధన్ రెడ్డి లాంటి మహా నేతల ఆధ్వర్యంలో తాము పనిచేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి, అసంఘటిత రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు.

సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలంలో కొత్తగా నియమితులైన 146 మంది లైసెన్స్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, శిక్షణ కార్యక్రమానికి సోమవారం జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ సర్వేయర్లు మీ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకొని, రేపటి నుండి ప్రారంభం కాకున్న శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హజరు కావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం 52రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టరు తెలిపారు. శామీర్‌పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డి, సర్వే ల్యాండ్రికార్డ్స్ ఎడి శ్రీనివాస్, బలరాం డిప్యూటి ఐఓస్, సత్యమ్మ డియోస్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, తహశీల్దార్, వ్యవసాయ ఏవోతో కలిసి షామీర్‌పేట్ మండలం అలియాబాద్లోని వరి కేంద్రాన్ని పరిశీలించారు.

ఇందిరమ్మ రాజ్యంతో తీరిన సొంత ఇంటి కల

విశాలాంధ్ర - మొయినాబాద్: ఇందిరమ్మ రాజ్యం వచ్చాక గ్రామాల్లో పేదల సొంత ఇంటి కలలు నెరవేరుతున్నాయని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. మండలంలోని తాళ్ళపల్లి, కేసారం, పోతుగల్, షాబాద్, కక్కులూర్, అంతారం గ్రామాల్లో భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేశామన్నారు. సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, షాబాద్ మాజీ సర్పంచ్ తమ్మలి రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, మంగలి చెన్నయ్య, యూత్ కాంగ్రెస్ మాజీ నియోజకవర్గ అధ్యక్షులు పెంటా రెడ్డి, బర్ల యాదయ్య, రవీందర్ రెడ్డి, వేణు, భార్గవ్ రామ్, సుభాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు, శ్రీరామ్ రెడ్డి, బుచ్చన్న, యాదగిరి, తొంట రామచందర్, చల్ల సంతోష్ రెడ్డి, మద్దూరు మల్లేష్, చంద్రయ్య, అస్మత్ పాషా పాల్గొన్నారు.

అవమాన పడ్డ చోటే గౌరవించబడుతున్నారు : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజంలో ట్రాన్స్‌జెండర్‌లు అంటే చిన్న చూపుతో చూస్తుందని, కానీ దాన్ని అధిగమించి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్లు తమ సత్తాను చాటారని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ట్రాన్స్ జెండర్‌లకు అవకాశాలు కల్పిస్తే రాణిస్తామని ట్రాఫిక్ అసిస్టెంట్లు నిరూపించారని, గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ జెండర్లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ప్రయోగాత్మకంగా మహిళా శిశు సంక్షేమ, వృత్తిలో దివ్యాంగులు ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం నియమించినట్లు వెల్లడించారు. దేశంలో మొట్టమొదటిసారిగా ట్రాఫిక్ అసిస్టెంట్‌గా ట్రాన్స్ జెండర్లను నియమించామని, కేవలం పది రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్‌లో నియమించి ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. ప్రతి ఒక్కరిలో సమర్థత ఉంటుందని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ట్రాన్స్ జెండర్లు గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్తాన్ ఉదయపూర్‌లో నిర్వహించిన చింతన్ శివిర్‌లో నేను ప్రత్యేకంగా ప్రస్తావించానని తెలిపారు. పోలీస్‌శాఖలోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్‌లను నియమించే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, ఎక్కడ ట్రాన్స్‌జెండర్‌ల మీద వివక్షత లేకుండా అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్ డ్రెస్‌లో ట్రాన్స్ జెండర్‌లను చూసి సామాన్యులు సెల్యూట్‌లో పడుతున్నారని, ఒకప్పుడు అవమానాలు ఎదుర్కొన్న ట్రాన్స్ జెండర్లు ఇప్పుడు అపూర్వ గౌరవాన్ని అందుకుంటున్నారన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, వృద్ధులు దివ్యాంగులు ట్రాన్స్జెంటర్ల శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, ప్రముఖ రచయిత్రి, మహిళా హక్కుల నేత కొండవీటి సత్యవతి, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల విజయ లక్ష్మీ డివిజన్ ప్రజలను కోరారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్.బి.టి నగరంలో ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ ను మేయర్ గద్వాల్ విజయ లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంటిలో ఉన్న చెత్తను తప్పని సరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, తెలిసిన వేయడక పోవడం, చెత్తను బయట వేయడం వలన దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. డివిజన్ ప్రజలు స్వచ్ఛ డివిజన్‌గా తీర్చి దిద్దేందుకు నివాసితులు సహకరించాలన్నారు. వార్డు ప్రజలు తమ చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలని కోరారు. కొన్ని ఏరియాలో బిన్స్ పెట్టిన వేయడం లేదని చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయవద్దని కోరారు. అదే విధంగా భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్డుపై వేయ వద్దని, జీహెచ్ఎంసీ సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వారికి ఫోన్ చేస్తే వారే తీసుకొని పోతారని, బయట వేయడం మూలంగా అనారోగ్య బారిన పడే అవకాశం ఉంటుందని మేయర్ తెలిపారు. హార్వెస్ట్ పిట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. గత పదేళ్ల నుండి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని చెప్పారు. ఎన్నికల సందర్భంలో మాత్రమే రాజకీయాలు చేయాలని అన్నారు. పరిశుభ్రతకు అందరు ఒక్కటై నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. బంజారాహిల్స్ వార్డులో ఎన్.బి.టి నగర్, బోలానగర్, ఉదయ్ నగర్, ఖాజా నగర్, శ్రీరామ్‌నగర్‌లలో ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వడం జరిగిందని, నిర్మాణ సందర్భంగా ఏర్పడిన వ్యర్థాలు రోడ్డు పైన గాని, నాలాలలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ లో అంగన్వాడీ, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ... ప్రీ శానిటేషన్ డ్రైవ్ లో బంజారాహిల్స్ మూడు నుండి 5 రోజుల్లో క్లీన్ చేయడం జరుగుతుందని, డివిజన్ లోని పలు కాలనీలో పనిచేసే శానిటేషన్ కార్మికులు వారిని ఏ మాత్రం వారికి ఇబ్బంది లేకుండా రెండో సారి అటెండెన్స్ తీసుకొనే సమయంలో కార్మికులు అందరూ ఒకే చోట పని చేసి మొత్తం శుభ్రం చేస్తారని అడిషనల్ కమీషనర్ తెలిపారు.

రైతు సంక్షేమం కోసమే విత్తన చట్టం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన చట్టం రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశమైంది. ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత మొదటిసారిగా ఈరోజే బీఆర్కే భవన్‌లో సమావేశమైయ్యారు. కమిటీ కన్వీనర్, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా తీసుకురాబోతున్న విత్తన చట్టంలో ఎలాంటి అంశాలు చేర్చాలి అనే అంశాలపై సుదీర్ఘ చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలపై అధ్యయనం చేయడంతోపాటు తెలంగాణలోని రైతుల నుండి సూచనలు సలహాలు తీసుకొని సమగ్ర విత్తన చట్టం రూపొందించాలని అభిప్రాయానికి కమిటీ వచ్చింది. విత్తన చట్ట ముసాయిదాలో కీలకంగా రైతుకు విత్తన హక్కు కల్పించడం, నకిలీ విత్తనాలు అరికట్టడం, ఒకవేళ నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లించాలి అనే అంశాలు ఈ రోజు జరిగిన సమావేశంలో చర్చించారు. విత్తన చట్టం ముసాయిదా రూపొందించడానికి ముందు కమిటీ ఫీల్డ్ విజిట్ చేసి, రైతుల నుండి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. ఇక రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో సమావేశాలు నిర్వహించాలని, సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు, డీలర్స్‌తో కూడా దశల వారీగా చర్చించాలని భావిస్తున్నారు. దానికోసం గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి విత్తన ముసాయిదాను రూపొందించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. రైతుల నుండి వచ్చే సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ.. విత్తన చట్ట ముసాయిదా రూపొందించాలని కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. విత్తన కమిటీ కన్వీనర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, కమిటీలో సభ్యులుగా ఉన్న సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహా రెడ్డి, రామాంజనేయులు, కమిటీ సభ్యులుగా ఉన్న శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి డైరెక్టర్ సీడ్ ఎంవీ నగేష్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవింద్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోరడేని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ సమీక్ష నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో ముందుకు వెళ్తుందని, నిధుల మంజూరుకై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే రానున్న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లను చేయాలని వినతిపత్రాన్ని అందించా. అనంతరం మంజీర పైప్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

పటాన్‌చేరు డీఎస్పీగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : పటాన్ చేరు నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ ప్రభాకర్, బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌ని బిజెపి జిల్లా కార్యదర్శి టెలికం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ న్యాయవాది బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంగడి బాలరాజు, బిజెపి జిల్లా మహిళా మోర్చా సభ్యులు, దిశా కమిటీ మెంబర్ కే.సుజాత పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి పక్కకు జరపాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ మరమ్మతులు చేసి పక్కకు జరపాలని స్థానిక బిఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ కోరారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని యాదవ నగర్ పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ మరమత్తులు చేయాలని విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. స్పందించిన విద్యుత్ అధికారులు ఏ.ఈ రవీందర్ శనివారం సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ను పరిశీలించారు. త్వరలో పక్కకు జరిపి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చినట్లు రాము యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్మెన్ తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు గొల్లపల్లి కృష్ణ గౌడ్, కిట్టు, మల్లేష్ యాదవ్, మర్రి శీను తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ మధురా నగర్‌లోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి విగ్రహానికి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా లక్ష రూపాయలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, కిషోర్, అవినాష్, వినయ్, సంగమేష్, సంతోష్, లడ్డు పాల్గొన్నారు.

మృతదేహాలను చూసి భయపడడం సిగ్గుచేటు

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : మే 21 న జరిగిన నారాయణపూర్ ఎన్ కౌంటర్లో చనిపోయిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో మరికొందరి మృతదేహాల పట్ల కేంద్ర, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల బీజేపీ ప్రభుత్వ పాలకులు అనుసరిస్తున్న అమానవీయ, అప్రజాస్వామిక వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ జవహర్‌నగర్‌లోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సోమవారం ఆదివాసి సంఘీభావ హక్కుల వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత ఆధ్యక్షతన మేడ్చల్, కాప్రా, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్, బాలాజీనగర్ పరిధిలో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబుజగ్జీవన్ రావు విగ్రహాల ముందు జరిగిన నిరసనలో ప్రజా కవి, రచయిత, కళాకారుడు ఎస్.కె.మీరా, సిపిఐ దర్శనం య్యాదగిరి, సిపిఎం శివన్నారాయణ, బీఎస్పీ బిర్రు యాకస్వామి, గుగ్గిల్ల సుప్రియరెడ్డి, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎం.డి.పాషామియా, బహుజన సత్త పార్టీ బండకింది సింగరయ్య గౌడ్, సిపిఐ మహిళా, ఏ.ఐ.టి.యు.సి. కె.బేబక్క, డి.మల్లిక, డి.నగేష్, ఎం.రాములు, ఇఫ్టూ షేక్ షావలి పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఈనెల 21న జరిగిన ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ ఎన్ కౌంటర్‌లోని మృతదేహాలను బందుమిత్రులకు అప్పగించడంలో బీజేపి, చత్తీస్ ఘడ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఈ రోజుకి కూడా ఛత్తీస్‌గడ్ పోలీస్ మావోయిస్టు పార్థివదేహాలను అప్పజెప్పడంలో జరుగుతున్న జాప్యం వెనుక శవాలను చూసి రాజ్యం భయపడడం సిగ్గుచేటని అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని మండపడ్డారు. శవాల పట్ల అనుసరిస్తున్న కనీస మర్యాదను, బాధ్యతను కూడా పాటించకపోవటాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. గత ఐదు రోజులుగా మృతదేహాల కోసం బంధుమిత్రులు హాస్పిటల్ వద్ద పడిగాపులు పడుతున్నారని గుర్తు చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలనిలతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో 86 దరఖాస్తులు రాగా అందులో హౌసింగ్‌శాఖ 40, పెన్షన్స్ 14, దివ్యాంగులు శాఖ 8, రెవెన్యూ 13, ఇతర శాఖలు 11 కలవని మొత్తం 86 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఈ. వెంకటాచారి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఇంచార్జ్ ఏవో సునీత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్, డిబ్ల్యూఓ కోటాజీ, బిసి వెల్ఫేర్ డిడి ఆశాన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ మహమ్మద్, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడి రాజేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం అభినందనీయం

విశాలాంధ్ర - అమనగల్లు : నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ సమీపంలో పేద ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందించే జామియా ఇస్లామియా దారుల్ ఉలూమ్ కైసర్ ఉర్దూ పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ఖరీదు అవుతున్న విద్యను విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన పాఠశాల ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రిని ఆయన అభినందిస్తూ స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థు లకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు నరసింహ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మహబూబ్, హాఫిజ్ హనీఫ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా యాదయ్య గౌడ్, కాసర్ల నాగరాజు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సిపిఐ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా 4వ మహాసభలో మల్కాజిగిరి మండలం నుండి టీ యాదయ్య గౌడ్, కాసర్ల నాగరాజు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టి యాదయ్య గౌడ్, కాసర్ల నాగరాజులు మాట్లాడుతూ పార్టీ తమపై నమ్మకంతో కౌన్సిల్‌కు ఎన్నుకున్నందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి జిల్లా కార్యదర్శికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేసే పోరాటాలలో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు.

బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ మలిదశ ఉద్యమకారులు బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలని, యాదాద్రి భువనగిరి జిల్లాకు బెల్లి లలిత పేరు పెట్టాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద బెల్లి లలిత 26వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత విగ్రహాన్ని ట్యాంక్ బండ్ మీద పెట్టాలన్నారు. బెల్లి లలిత జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసిన బెల్లి లలిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్లి లలిత వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌కుమార్ యాదవ్, బీసీ జన చైతన్య వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కదారి కాశీం యాదవ్, కార్పొరేటర్లు బోమ్మక్ కళ్యాణ్ కుమార్, సిసా వెంకటేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త చక్రపాణి గౌడ్, చెంచల నర్సింగ్‌రావు, బోడుప్పల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, మరాటి మత్స్యగిరి, చిందం రాజు, ప్రసాద్ రెడ్డి, క్రాంతి కుమార్, సత్యనారాయణ, కనేబోయిన సురేష్ యాదవ్, ఆసర్ల మధు, కట్ట వీరేందర్ రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణాచారి, ప్రసాద్ యాదవ్, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్.. పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

విశాలాంధ్ర-దుండిగల్ : ట్రాఫిక్‌తో రోడ్లన్నీ రద్దీగా ఉన్నా, వాటిని క్రమబద్ధీకరించేందుకు రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు మాత్రం కనిపించడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. రోజువారీగా చలాన్లు వేయడం, వాటిని వసూలు చేయడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తున్నారు. అందులో భాగంగానే దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లి టెక్ మహీంద్రా యూనివర్సిటీ ముందు ప్రతి రోజు అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా నడిరోడ్డు పైన వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో అటువైపుకు వెళ్లే ప్రయాణికులు, నడుచుకుంటూ వెళ్లే పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ, విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూనే ఉంటుంది. దానికి తోడు ప్రైవేట్ వాహనదారులు నడిరోడ్డు మీదనే పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. దీంతో రోడ్డు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకొని రోడ్డుమీద ప్రైవేటు వాహనాలను పార్క్ చేయకుండా చూడాలని పాదాచారులు కోరుతున్నారు. గండి మైసమ్మ జ్యోతిరావు పూలే క్రికెట్ స్టేడియం, టెక్ మహీంద్రా రహదారిపై ప్రయాణించాలం టేనే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వాహనాలు అతి వేగంగా వస్తూ భయాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డు దాటాలంటే గుండెలు గుభేలు మంటున్నాయి. ప్రధాన రహదారులపై కూడళ్ల వద్ద ప్రమాద సూచికలు, నిర్దిష్టమైన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ప్రజల విలువైన ప్రాణాలను కాపాడాలి.

లోకేశ్‌కు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి!

జీవీ, ఆనం వ్యాఖ్యలు

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగుదేశం పార్టీలో యువనేత నారా లోకేశ్ కు మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించాలనే చర్చ జోరందుకుంది. త్వరలో జరగనున్న మహానాడు వేదికగా ఈ అంశాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఈ విషయంపై మాట్లాడుతూ, కోట్లాదిమంది క్రియాశీల సభ్యులు, కార్యకర్తలు నారా లోకేశ్ ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని తెలిపారు. "కార్యకర్తల హృదయాల్లోంచి వస్తున్న ఈ ఆకాంక్షను మహానాడులో మా అధినేత చంద్రబాబు గారి దృష్టికి కచ్చితంగా తీసుకెళతాం. పార్టీని మరో 40 సంవత్సరాల పాటు యువశక్తితో నింపి, 'విజన్ 2047' లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమై, నూటికి నూరు శాతం సీట్లు సాధించే దిశగా ఎన్డీయే కూటమి ముందుకు సాగుతుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యువశక్తితో పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలన్నదే అందరి లక్ష్యమని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

సీపీఐ వందేళ్ల పోరాటం అజరామరం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-నరసరావుపేట: వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎర్రజెండా దళిత బడుగు బలహీన మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం, రైతులు కార్మిక వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీపీఐ పల్నాడు జిల్లా సమితి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. భూమికోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి కోసం ఎర్రజెండా ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసింది... దొరలు, భూస్వాముల కబంధహస్తాల్లో చిక్కుకున్న లక్షలాది పేద బడుగు వర్గాల కుటుంబాలకు విముక్తి కలిగించిందని చెప్పారు. పేద ప్రజలు, రైతులకు లక్షలాది ఎకరాల భూములను పంపిణీ చేసిందన్నారు. అధికారంలో ఎవరున్నా కూడా ప్రజల హక్కుల కోసం సీపీఐ రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరంకుశ విధానాలతో ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తెస్తోందని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలన మోదీ విధానాలపై ఆధారపడి ఉందన్నారు. రాష్ట్రానికి అనేక వాగ్దానాలు చేసిన ప్రధాని మోదీ మొండిచేయి చూపించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తుందని ముప్పాళ్ల తెలిపారు. జిల్లాలో గ్రామ శాఖల నుండి మండల, పట్టణ , నియోజకవర్గ పార్టీ మహాసభలను పూర్తిచేసుకుని జిల్లా మహాసభలు జయప్రదంగా నిర్వహించాలన్నారు. మంచి నాయకత్వాన్ని ఎన్నుకొని పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన వారందరికీ వృద్ధాప్య, ఒంటరి మహిళ, వితంతు, వికలాంగ పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన వారందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలు 14, 15 తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరపడానికి నిర్ణయించడం జరిగిందని చెప్పారు. మహాసభల ఘనంగా నిర్వహించడానికి జిల్లాలోని ప్రజా సంఘాలు, పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశానికి సీపీఐ మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము, చిలకలూరిపేట ఇంఛార్జి కార్యదర్శి తాళ్లూరు బాబురావు, నరసరావుపేట ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, మహిళా సంఘం నాయకురాలు చెరుకుపల్లి నిర్మల, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, రాయబారం వందనం, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సోషల్ మీడియా విస్తృత సమావేశం ప్రారంభం

న్యూఢిల్లీ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సోషల్ మీడియా విభాగం విస్తృత సమావేశం (మే26-27) సోమవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయం అజయ్ భవన్‌లో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా... సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి ప్రపంచంలో సోషల్ మీడియా ప్రాముఖ్యతను వివరించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి బాలచంద్ర కాంగో విస్తృత సమావేశం లక్ష్యాలను వివరించారు. పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు సయ్యద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, జాతీయ నాయకులు అనీరాజా, పల్లవ్‌సేన్‌గుప్తా కూడా ప్రసంగించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టడంతో పాటు పార్టీ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడం, డిజిటల్ కేడర్‌ను ప్రోత్సహించడం, డిజిటల్ ప్లాట్‌ఫాంలను ఉపయోగించడం తదితర అంశాలపై కార్యకర్తలకు వివరించారు. పార్టీ సోషల్ మీడియా ఇంఛార్జ్ వివేక్ శర్మ అధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుండి కమ్యూనిస్టు పార్టీ నాయకులు కాగితాల రాజశేఖర్, ఎంపీ సుబ్బారావు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పార్టీ సోషల్‌మీడియా విభాగ కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో సమర్థంగా విస్తరించడం, ఆన్‌లైన్ ప్రచార వ్యూహాలను రూపొందించడం, రాష్ట్ర శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం వంటి కీలక అంశాలపై కార్యాచరణ రూపొందించేందుకు చర్చ జరుగుతోంది.

మావోయిస్టులతో శాంతి చర్చలు

నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: మావోయిస్టులతో శాంతి ఒడంబడికకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ డిమాండ్ చేశారు. నక్సలైట్లపై కాల్పుల విరమణను తక్షణమే ప్రకటించాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. శాంతిచర్చల కోసం మావోయిస్టులు ఇప్పటికే లేఖలు రాశారని, దీని ఆధారంగా కాల్పుల విరమణకు మావోయిస్టులు అంగీకరించినట్లు స్పష్టమవుతోందని, కేంద్రం కూడా ఇందుకు ముందుకు రావాలని నారాయణ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు ఈ దేశ పౌరులని, వారు ఉగ్రవాదులు కాదని చెప్పారు. ఉగ్రవాదన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌తో చర్చలు జరిపినప్పుడు... మన దేశ పౌరులైన మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడం పెద్ద కష్టమేమీ కాదని, ఆటంకం ఏమీ రాదని అన్నారు. మావోయిస్టులతో సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప మరొకటి కాదని, తుపాకీ గొట్టాల ద్వారా సమస్య పరిష్కారం కాదని, రాజకీయ చర్చలు జరిపి శాంతి ఒడంబడిక చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని నారాయణ కోరారు.

మరోవైపు...పుదుచ్చేరి బీచ్‌లో కేంద్ర ప్రభుత్వం యోగా మహోత్సవం నిర్వహిస్తోందని, దీనికి సంబంధించి పెద్దఎత్తున అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చిందని, అవన్నీ హిందీలో ఉన్నాయని, స్థానిక భాష అయిన తమిళం గానీ, ఇంగ్లీష్‌కానీ ఒక్క పదం కూడా లేదని నారాయణ విమర్శించారు. యోగా మహోత్సవం జరిగే రోడ్డుకు పుదుచ్చేరి మొదటి ముఖ్యమంత్రి కుబేర్ పేరు పెట్టారని, ఆయన పేరు సైతం హిందీలోనే రాశారని...అది కూడా ఆవు అర్థం వచ్చేలా ఉందని నారాయణ చెప్పారు.

వీఆర్‌ఏల కష్టాలు ఇంకెన్నాళ్లు?

- అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు
- మహానాడు సందర్భంగా అసోసియేషన్ బహిరంగ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రెవెన్యూ శాఖలో దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలకు నిరంతరం సేవలందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) ఇంకెన్నాళ్లు కష్టాలు పడాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య, అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు సందర్భంగా అసోసియేషన్ తరపున బహిరంగ లేఖ విడుదల చేశారు. గ్రామాలలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల జీవితాలలో ఎలాంటి మార్పు రాలేదని, క్షామం తప్ప సంక్షేమం లేదని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో చిరు ఉద్యోగులుగా గ్రామ రెవెన్యూ సహాయకులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేల మంది పార్ట్ టైం పేరుతో పూర్తి కాలం పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలకు వివిధ రంగాల్లో దాదాపు 54 రకాల సేవలు అందిస్తున్నారని అన్నారు. నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు గ్రామ సేవకులను వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేసి మా గుండెలలో గుడి కట్టుకున్నారని వివరించారు. ప్రస్తుతం అరకొర వేతనాలతో అప్పులు, వడ్డీల బాధలతో, పెరిగిన నిత్యావసర ధరలతో, పని ఒత్తిడి కారణంగా వీఆర్‌ఏలు మళ్లీ వెట్టి చాకిరీలోకి నెట్టబడ్డారని పేర్కొన్నారు. వీఆర్‌ఏలుగా ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు చెందిన పేదవారే ఉన్నారని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెంచిన జీతం కేవలం రూ.10,500 తో కుటుంబాన్ని అతి కష్టంగా నెట్టుకువస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా వీఆర్‌ఏల సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు ఇవే...

వీఆర్‌ఏలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తూ పే స్కేల్ ఇవ్వాలని, నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, ఖాళీలు ఏర్పడి దీర్ఘకాలికంగా భర్తీ చేయని వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్లను వీఆర్‌వోలుగా పదోన్నతులు కల్పించాలని, మహిళ వీఆర్‌ఏలకు ప్రసూతి సెలవులు కల్పించాలని, కార్యాలయాల్లో స్వీపర్ పోస్టులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వీఆర్‌ఏలనే నియమించాలని, రెవెన్యూ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు పూర్తిగా నిలుపుదల చేసి వీఆర్‌ఏలకే పదోన్నతులు కల్పించాలని, అర్హత, నైపుణ్యం కలిగిన వీఆర్‌ఏలను కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమించాలని, వీఆర్‌ఏలకు ప్రస్తుతం ఉన్న ప్రమోషన్ కోటాను 30 శాతం నుంచి 70 శాతం వరకు పెంచాలని తద్వారా దశాబ్దాలుగా సర్వీసు ఉన్న వారికి న్యాయం చేయాలని కోరారు. 2018 జూన్ నుంచి 2015 ఫిబ్రవరి వరకు రావలసిన రికవరీ సొమ్ముతో పాటు పాత డీఏ బకాయిలు చెల్లించాలని, డీఏ రూ.1,000 పెంచాలని, కార్యాలయం పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో వీఆర్‌ఏలకు సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుతం చెల్లిస్తున్న రెండు సంవత్సరాల గ్రాట్యూటీని రూ.10 లక్షలుగా పెంచాలన్నారు. వీఆర్‌ఏలకు సర్వీసు ముగిసిన తర్వాత చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాల కోసం 2న మండల కేంద్రాల వద్ద ధర్నా

జల్లి విల్సన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున నివాసయోగ్యమైన నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యాలయంలో సోమవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం షేక్ కాలేషాగారి ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం గడుస్తున్నా.. నేటికీ ఇళ్ల స్థలాలపై స్పష్టత లేదన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో సచివాలయాలలో ఇచ్చిన అర్జీలపై ప్రశ్నించాలన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామ శాఖలు మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణను పార్టీ సభ్యుడు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. దేశ ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ఆపరేషన్ సిందూర్‌తో కాలక్షేపం చేస్తున్నారని జల్లి విల్సన్ విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి మోదీ సర్కారు తూట్లు పొడుస్తోందని, గ్రామీణ కూలీలకు, పేదలకు పనులు లేకుండా నిధులు దారిమళ్లిస్తున్నదని మండిపడ్డారు. రైతు, నిరుద్యోగం, పేదరికం సమస్యలపై కనీసం మాట్లాటడం లేదని, నల్లధనాన్ని కట్టడి చేయలేదన్నారు. విదేశాలలో ఉన్న రూ.70 లక్షల కోట్లు వెనక్కి తీసుకురాలేదన్నారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు వెళ్లిన వారికి వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. ప్రజల మధ్య చీలిక తెచ్చి మత ప్రాతిపదికన విభజన సృష్టిస్తున్నారని మోదీ సర్కారుపై మండిపడ్డారు. 44 కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కౌలు రైతులు ప్రధానంగా నల్ల బర్లీ పొగాకు, మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా సమితి సభ్యులు బత్తుల శామ్యూల్, ఏటగిరి శ్రీనివాసరావు, చిరమల ప్రకాశ్, నంబూరి సత్యం, సైకం రాజశేఖర్, రత్నకుమారి, ముస్తాఫా మాస్టర్, మేడా వెంకటరావు, అద్దంకి నాగేశ్వరరావు, మల్లెల ఏసోబు, మేకల వెంకాయమ్మ, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, కాగిత ప్రశాంత్‌రాజు, మేకల రమణయ్య, మేకల బిజిలిబాబు, దుండి కనకారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, మేకల రమణయ్య, పొట్లూరి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

పాక్‌పై భారత్ దాడులు...బుక్‌లెట్ విడుదల

న్యూఢిల్లీ: పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన కీలక వివరాలను భారత సైన్యం ఒక బుక్‌లెట్ రూపంలో విడుదల చేసింది. మే 7వ తేదీన జరిగిన ఈ దాడుల సమయంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌లతో పాటు ఒక సీనియర్ ఆర్మీ అధికారి 'ఆపరేషన్స్ రూమ్'లో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్న రెండు కొత్త చిత్రాలను ఈ బుక్‌లెట్‌లో పొందుపరిచారు. ఈ చిత్రాలలో ఒకటి, మే 7వ తేదీ తెల్లవారుజామున 1:05 గంటలకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు జనరల్ ద్వివేది, మరో సీనియర్ అధికారి ఒక స్క్రీన్‌ను పరిశీలిస్తున్నట్లు చూపుతోంది. డ్రోన్ ఫుటేజ్, శాటిలైట్ చిత్రాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటూ వారు ఆపరేషన్‌ను పర్యవేక్షించారు.

దేశ ప్రగతికి జమిలి ఊతం

చెన్నై సెమినార్‌లో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఒకే దేశం-ఒకే ఎన్నిక దేశానికి చాలా అవసరమని, దీనిని దేశ ప్రగతికి చేయూతనిచ్చే గొప్ప సంస్కరణగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. చెన్నై తిరువాన్మియూర్‌లోని రామచంద్ర కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళ సై సౌందర రాజన్ అధ్వర్యాన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అంశంపై సోమవారం నిర్వహించిన సెమినార్‌లో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. దేశంలో ఎన్నికలు నిరంతర ప్రక్రియలా మారిపోయి... దేశ ప్రగతికి ఆటంకం కలిగిస్తున్నాయని పవన్ అన్నారు. తరచూ ఎన్నికల నిర్వహణతో ఖర్చుతోపాటు సమయం వృథా అవుతోందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడం వల్ల అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోతున్నాయన్నారు. ఐదేళ్ల పాలన కాలంలో దాదాపు 800 రోజులు కేవలం ఎన్నికల నిర్వహణకే ఖర్చయిపోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశానికి లాభమే తప్ప నష్టం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. మన దేశానికి ఉన్న సామర్థ్యం రీత్యా జమిలి ఎన్నికల ఆచరణ సాధ్యమేనన్నారు. ఈ తరహా ఎన్నికల వల్ల ప్రచార ఖర్చులు తగ్గుతాయని, పరిపాలనలో అవరోధాలు ఉండవని, పాలన క్రమబద్ధీకరణ జరుగుతుందని అన్నారు. తమిళనాట ఈ విధానంపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో ఇండియా ఐక్యసంఘటన పక్షాలు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. ఒకప్పుడు కరుణానిధి సమర్థించిన వన్ నేషన్-వన్ ఎలక్షన్ విధానాన్నే ఇప్పుడు ఆయన కుమారుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యతిరేకించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గతంలోనూ భారత్‌లో ఈ విధానాన్ని అనుసరించామని, స్వాతంత్రం వచ్చాక సుమారు రెండు దశాబ్దాలపాటు దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు జరిగేవన్నారు. జమిలి ఎన్నికల వల్ల జీడీపీ 1.5 శాతం మేర పెరిగే అవకాశం ఉందని కమిటీ సూచించిందని, ఇది సుమారు రూ.4.5 లక్షల కోట్లతో సమానమన్నారు. జీడీపీ పెరిగితే అది ప్రతి సామాన్యుడి జీవితాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ఆ మొత్తం ద్వారా దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల ఈ అంశంపై స్టాలిన్‌తోపాటు ఈ విధానాన్ని వ్యతిరేకించే రాజకీయపక్షాలన్నీ పునరాలోచన చేయాలని పవన్ కల్యాణ్ కోరారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్, జాతీయ కార్యదర్శులు అనిల్ ఆంటోని, అరవింద్ మేనన్, తమిళనాడు, కర్నాటక ఇంఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

- నదులను తలపిస్తున్న రహదారులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విమాన రాకపోకలకు అంతరాయం
- స్తంభించిన జనజీవనం
- కేరళలో 11 జిల్లాలకు రెడ్ అలర్ట్

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. 16 ఏళ్ల తర్వాత ముందే దేశంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు బలంగా ఉండటంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా అనేక రాష్ట్రాల్లో బీభత్సకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ముంబై, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక చోట్ల రహదారులు నదులను తలపించడం, చెట్లు పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో జనజీవనం అతలాకుతలమైంది. విమానాల రాకపోకలపై కూడా ప్రభావం పడింది. తమిళనాడులోని ఊటీలో చెట్టుపడి బాలుడు మృతి చెందగా, కర్నాటకలో బెళగావి జిల్లాలో గోడకూలి నిద్రలోనే మూడేళ్ల బాలిక ప్రాణాలొదిలింది. మహారాష్ట్రలోని ముంబైలో సోమవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల్లో సబర్బన్ రైలు సర్వీసులు నిలిచిపోయాయి. ట్రాక్‌లపైకి వాన నీరు చేరడంతో రైల్వే సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది.

మెట్రో స్టేషన్ పైకప్పులో లీకేజీ కారణంగా ప్లాట్‌ఫారమ్‌పై నుంచి నీరు ప్రవహించింది. భారీ ఎత్తున నీరు నిలిచిపోవడంతో మెట్రోసర్వీసులకు ఆటంకం ఏర్పడింది. అయితే, అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో వరదకు కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమే కారణమని తెలుస్తోంది. విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌ఇండియా సహా పలు ఎయిర్‌లైన్లు ట్రావెల్ అడ్వైజరీని జారీ చేశాయి. సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలించాలని సూచించాయి. దాదార్, మహిమ్, పరెల్, బాంద్రా, కాలాచౌకీతో పాటు మరిన్ని ప్రాంతాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఢిల్లీలో ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఢిల్లీ కంటోన్మెంట్, ధౌలా కువాన్, సుబ్రోతో పార్క్, నానక్ పురాలు నీట మునిగాయి. నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళను పలకరించడంతో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. 11 జిల్లాలకు భారత వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

అందుబాటులోకి భారత కొత్త వాతావరణ వ్యవస్థ

న్యూఢిల్లీ: వాతావరణ ముందస్తు సమాచారం పక్కాగా చెప్పే కొత్త భారత వాతావరణ వ్యవస్థను కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సోమవారం జాతికి అంకితం చేశారు. గతంలో ఆరు కిలోమీటర్లు దూరం అయితే... ఇప్పుడు 12 కిలోమీటర్ల ముందుగానే తెలుసుకోవచ్చని భారత వాతావరణశాఖ పేర్కొంది. కొత్త వ్యవస్థ ద్వారా గ్రామాల వారీగా అంచనా ఇవ్వచ్చొని ఐఐటీఎం పుణే డైరెక్టర్ పేర్కొన్నారు. ఐదురోజులు ముందుగానే పక్కా సమాచారం ఇవ్వనున్నట్లు ఐఎండీ వెల్లడించింది. ఈ ఏడాది ఎనిమిది రోజులు ముందుగానే రుతుపవనాలు వచ్చాయని ఐఎండీ డైరెక్టర్ మృతుంజయ్ మోహపాత్ర పేర్కొన్నారు. గతేదాదితో పోలిస్తే ఈ సారి సాధారణం కంటే వర్షాలు ఎక్కువగా పడుతాయన్నారు. కొత్త గ్లోబల్ న్యూమరికల్ మోడల్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్‌ను అతివృష్టిని అంచనా వేయడంలో సహాయపడుతుందని అధికారులు తెలిపారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ భారత్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్‌ను ఐదుగురు మహిళా శాస్త్రవేత్తలు రూపొందించారని పేర్కొన్నారు. ఇది భారతదేశం మహిళా అధ్వర్యంలో అభివృద్ధి చెందుతోందనడానికి సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు. ఇండియన్ మిటియరాలజికల్ డిపార్ట్‌మెంట్ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో నాల్గవ స్థానానికి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. గత కొన్ని సంవత్సరాల్లో విపత్తుల నివారణ ద్వారా, లాభాలను పెంచడం ద్వారా రూ.50వేల కోట్ల కంటే ఎక్కువ ప్రయోజనం కలిగిందన్నారు. పుణెకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ అభివృద్ధి చేసిన ఈ భారత్ ఫోర్కాస్ట్ సిస్టమ్ ప్రపంచంలోనే అత్యంత అధిక రిజల్యూషన్ (6 కిలోమీటర్లు) గల వాతావరణ మోడల్. ఇది చిన్న స్థాయి వాతావరణ లక్షణాలను మరింత ఖచ్చితంగా అంచనా వేయడానికి వాతావరణశాస్త్ర విభాగానికి సహాయపడనున్నది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.